నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 13-12-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:103 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం- నేటికి అందం

భాసురమైన విశాఖకు
కాసుల నిడు కాగ్నిజెంటు కార్యాలయమున్
మోసులు వారగ కట్టగ
నాసీరుడు చంద్రబాబు నాయుడు వచ్చెన్ !!

(కాగ్నిజెంట్ కంపెనీ కార్యాలయం శంకుస్థాపన చేయడానికి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు విశాఖ పట్నం వచ్చారు.)

-రాధశ్రీ
సెల్:9494481210

బుర్క

కారు ఇంకా గ్రామాల్లో
కడుహీనం పరిస్థితి
స్టీరింగ్ ను అధినేత
చేపట్టక ఈ దుస్థితి
పల్లెపోరు మొదటిదశ
పట్టు నేడు హస్తగతం
గుణపాఠం నేర్వకుంటే
గులాబీ పరుగు ఖతం

-వేల్పుల నారాయణ
9440433475

నగరంలో జరగబోయే 'మెస్సీ గోట్ ఇండియా టూర్'కి రాహుల్ గాంధీ..!

హైదరాబాద్, డిసెంబర్ 12:నగరంలో జరగబోయే 'మెస్సీ గోట్ ఇండియా టూర్' అనేది ఓ ప్రైవేట్ ఈవెంట్ అయినప్పటికీ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ప్రత్యేకంగా హాజరు కావాల్సిందిగా కోరినట్లు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ బయలుదేరే ముందు ముఖ్యమంత్రి అక్కడి మీడియాతో మాట్లాడారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ ఫుట్ బాల్ ప్లేయర్ లియోనెల్ మెస్సీ ఈనెల 13న హైదరాబాద్ వస్తున్నారని.. ఓ ప్రముఖ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారని సీఎం చెప్పారు.

ఈ కార్యక్రమానికి తననూ ప్రత్యేక అతిథిగా పిలిచారని.. అయితే ఇది ప్రభుత్వానికి సంబంధం లేని ఈవెంట్ అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మెస్సీతోపాటు లూయిస్ సువారెజ్, రోడ్రిగో డి పాల్ వంటి అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొంటారు. అయితే, ఈ కార్యక్రమంలో మెస్సీ వర్సెస్ రేవంత్ రెడ్డి జట్లు 5 నిమిషాలపాటు మ్యాచ్ ఆడనున్నారు. మెస్సీతోపాటు ప్రముఖుల రాక నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే.. ఈ కార్యక్రమానికి సీనియర్ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వస్తున్నారా, లేదా? అన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు.

కేంద్ర కేబినెట్‌లో సంచలన నిర్ణయాలు..

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. 2027 జనగణన, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు వంటి పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ మీడియా సమావేశం నిర్వహించారు. మంత్రివర్గంలో తీసుకున్న అంశాలను వివరించారు.

కీలక నిర్ణయాలు ఇవే..

-2027లో రెండు విడతల్లో జరగనున్న జనగణన కోసం రూ.11,718 కోట్ల బడ్జెట్‌ను కేబినెట్ ఆమోదించింది. ఈ జనగణనను డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించి నిర్వహించనున్నారు.

-మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు 'పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజన' గా మారుస్తూ నిర్ణయం

-ఈ పథకం కింద ఒక కుటుంబానికి ఏడాదికి ఉన్న గరిష్ఠ పని దినాలను 100 నుంచి 120 రోజులకు పెంచింది. రోజు కూలీని రూ.240గా నిర్ణయించింది. రూ.1.51 లక్షల కోట్లు కేటాయింపు.

-బొగ్గు గనుల్లో పలు సంస్కరణలు తీసుకురావడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది.

-పీఎం కిసాన్ సమ్మాన్ యోజన.. ఈ పథకం కింద అందించే మొత్తాన్ని రూ.6,000 నుంచి రూ.10,000 వరకు పెంచాలని నిర్ణయం తీసుకుంది.

- దేశవ్యాప్తంగా 57 కొత్త కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో తెలంగాణకు 4, ఆంధ్రప్రదేశ్ కి 4 మంజూరు చేసింది.

-నాలుగు కీలకమైన రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం

-సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ఔఅఆఅ కింద రూ.2,000 కోట్ల ఆర్థిక సహాయం

-పీఎం కిసాన్ సంపద యోజన.. ఈ పథకానికి రూ.6,520 కోట్లు కేటాయింపు.

-క్వాంటం టెక్నాలజీ పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించడానికి అదనంగా రూ.4,000 కోట్ల నిధులు కేటాయింపు

-మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ లకు బ్యాంకుల నుంచి సులభంగా రుణాలు లభించేందుకు వీలుగా రూ.15,000 కోట్లతో కొత్త క్రెడిట్ గ్యారెంటీ పథకానికి గ్రీన్ సిగ్నల్

-దేశంలోని డిజిటల్ మౌలిక సదుపాయాలను రక్షించడనాకి సైబర్ దాడులను నిరోధించడానికి సైబర్ సెక్యూరిటీ పాలసీకి ఆమోదం.

-సెమీకండక్టర్ తయారీని ప్రోత్సహించేందుకు రూ.12,000 కోట్లు కేటాయింపు. కొత్త సెమీకండక్టర్ తయారీ కర్మాగారాలను నెలకొల్పే సంస్థలకు ఆర్థిక సహాయం పెంపు.

-ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద అదనంగా 1.5 కోట్ల గృహాలను నిర్మించడానికి ఆమోదం

-చిన్న ఉపగ్రహాలను ప్రయోగించడానికి వీలుగా తమిళనాడులోని కులశేఖం పట్నం వద్ద కొత్త ప్రయోగ వేదిక నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

- 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని రక్షణ రంగంలో బలోపేతం చేయడానికి, రక్షణ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపరిమితి పెంపు

-దేశంలోని మారుమూల ప్రాంతాలకు సైతం వైద్య సేవలను అందించడానికి నేషనల్ టెలి-మెడిసిన్ నెట్‌వర్క్ ఏర్పాటుకు ఆమోదం

-నీటిపారుదల పథకాలకు జాతీయ మిషన్ ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 50 ప్రధాన, మధ్యస్థ నీటిపారుదల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడానికి రూ.35,000 కోట్లతో ఒక కొత్త జాతీయ మిషన్‌ను ప్రారంభించేందుకు కేబినెట్ లైన్ క్లియర్ చేసింది.

-భారత్ నెట్ ప్రాజెక్ట్ కింద ఇంటర్నెట్ సేవలు. ఇందుకోసం అదనంగా రూ.8,000 కోట్ల నిధులు కేటాయింపు

-రాష్ట్రాల ఆర్థిక బలోపేతం కోసం ప్రత్యేక ప్యాకేజీ. ఇందులో భాగంగా రాష్ట్రాలు తమ మూలధన పెంచుకోవడానికి.. వడ్డీ లేని రుణాల రూపంలో రూ.1.3లక్షల కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీకి గ్రీన్ సిగ్నల్.

తొలివిడతలో గెలుపుతో ప్రజల పట్ల తమ బాధ్యత మరింత పెరిగింది

-టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్ డిసెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని స్పష్టమైందని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. సర్పంచ్ ఎన్నికల తొలివిడతలో ఘనవిజయం సాధించామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇది సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కార్యకర్తల విజయం అని.. అన్ని వాగ్దానాలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నామని తెలియజేశారు. ఈ గెలుపుతో ప్రజల పట్ల తమ బాధ్యత మరింత పెరిగిందని, 2,3 దశల్లోనూ ఇలాంటి ఫలితాలే వస్తాయని మహేష్ గౌడ్ అన్నారు. ఓట్ చోరీతోనే తెలంగాణలో బిజెపి ఎంపిలు గెలిచారని, తెలంగాణలో 8 మందిని ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపిలు ఉన్న బిజెపి గ్రామ పంచాయితీ ఎన్నికల్లో గెలిచింది ఎంత? అని బిజెపి ఎమ్మెల్యేలు, ఎంపిలకు వేసిన ఓట్లు ఎక్కడికి పోయాయి? అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ నేతల బాగోతాలు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత బయటపెడుతోందని, కవిత ఆరోపణలపై దర్యాప్తు జరపాలని సిఎం రేవంత్ రెడ్డిను కోరతానని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

ఎముకలు కొరికేలా చలి తీవ్రత..

-హైదరాబాద్ లో గణనీయంగా పడిపోయిన సాధారణ ఉష్ణోగ్రతలు

హైదరాబాద్ డిసెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: భాగ్యనగరంలో చలి వణికిస్తోంది, ఎముకలు కొరికేలా చలి తీవ్రత మారింది. హైదరాబాద్ లో సాధారణ ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. తెల్లవారుజామున బయటకు రావాలంటే భయం వేస్తోంది. నీళ్లను ముట్టుకుంటే చాలు కరిచేస్తున్నాయి. జనం చలితో వణికిపోతున్నారు. శుక్రవారం ఉదయం జిహెచ్ఎంసి పరిధిలోని ప్రాంతాలలో 12 డిగ్రీల కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్ శివారులో శెరిలింగం పల్లి 6.3ళీ సెంటీ గ్రేడ్, మొయినాబాద్ వంటి శివార్లలో 5.4ళీ సెంటీ గ్రేడ్ ఇబ్రహీంపట్నంలో 6.3ళీ సెంటీ గ్రేడ్ నమోదయ్యాయి. సాయంత్రం 5 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు చలి గాలులు, పొగమంచుతో రహదారులు కమ్ముకుంటున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు తెలిపింది. పొగ మంచు, శీతల గాలుల కారణంగా రాత్రి పూట చలి ఎక్కువగా ఉంటుందని, ఉంటుందని, రానున్న మూడు రోజుల్లో మరింతగా ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉంది. రాత్రి కంటే ఉదయం 4 గంటల ప్రాంతంలో చలి ఎక్కువగా నమోదవుతున్నట్లు గణాంకాల ద్వారా తెలుస్తుందని, వాతావరణ శాఖ వెల్లడించింది.

కాంగ్రెస్ సీనియర్ నేత శివరాజ్ పాటిల్ కన్నుమూత



ముంబయి డిసెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి శివరాజ్ పాటిల్(90) కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ శుక్రవారం ఉదయం తుది శ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. శివరాజ్ పాటిల్ మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సోనియా గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. శివరాజ్ పాటిల్ మృతి తనను కలిచి వేసిందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. లాతూరు ప్రాంతంలోని చాకూర్ గ్రామంలో 1935 అక్టోబర్ 12న జన్మించారు. అప్పట్లో లాతూరు హైదరాబాద్ స్టేట్‌లో ఉంది. బాంబే యూనివర్సిటీలో పిజి చేశారు. 1963లో విజయ పాటిల్‌ను వివాహం చేసుకున్నారు. శివరాజ్ పాటిల్, విజయ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. లాతూరు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఏడు సార్లు ఎంపి గెలిచి ప్రజలకు సేవలందించారు.

ఇండిగో సంక్షోభం.. నలుగురు అధికారులపై డీజీసీఏ వేటు

న్యూ డిల్లీ డిసెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్);దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో లో సంక్షోభం కొనసాగుతోన్న విషయం తెలిసిందే. ఈ సంక్షోభంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ చర్యలకు పూనుకుంది. ఇందులో భాగంగానే నలుగురు ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్స్పెక్టర్లపై వేటు వేసింది. అయితే, వీరి తొలగింపు వెనుక ఎలాంటి కారణాన్ని డీజీసీఏ పేర్కొనలేదు. డీజీసీఏ ఆగ్రహానికి గురైన ఆ నలుగురు విమానయాన భద్రత, కార్యాచరణను పర్యవేక్షిస్తుంటారు. విధుల్లో నిర్లక్ష్యం కారణంగానే వీరిని తొలగించినట్లు తెలుస్తోంది. కాగా, గత పది రోజులకు పైగా గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇండిగోలో సంక్షోభం తలెత్తిన విషయం తెలిసిందే. ప్రతి రోజూ వందలాది విమానాలు రద్దు, ఆలస్యవ్యయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రయాణికులు ప్రభావితమయ్యారు. ఈ సంక్షోభం నేపథ్యంలో రంగంలోకి దిగిన డీజీసీఏ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ సంక్షోభానికి పర్యవేక్షణలో లోపాలే కారణమని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. దీంతో విమానాల భద్రత, కార్యాచరణను పర్యవేక్షించే నలుగురు అధికారులను సస్పెండ్ చేసింది.

భవిష్యత్‌లో సినిమా టికెట్ రేట్లు పెంచేప్రసక్తి లేదు

- నిర్మాతలు, దర్శకులెవరూ తమ దగ్గరకు రావొద్దు: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్ డిసెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: సినిమాలపై కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్‌లో సినిమా టికెట్ రేట్లు పెంచేది లేదని, నిర్మాతలు, దర్శకులెవరూ తమ దగ్గరకు రావొద్దు అని విజ్ఞప్తి చేశారు. కుటుంబాలతో సినిమాకు వెళ్లాలంటే టిక్కెటు రేట్లు తక్కువ ధరలుండాలని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. టికెట్ రేట్లు పెంచొద్దని గతంలోనే అనుకున్నామని అన్నారు. తమది ఇందిరమ్మ ప్రభుత్వమని, పేదల కోసమే నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలియజేశారు. ఈసారి పొరపాటు జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. హీరోలకు వందలకోట్ల రెమ్యునరేషన్లు ఎవరు ఇమ్మన్నారని కోమటిరెడ్డి ప్రశ్నించారు.

రేవంత్, మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్.. రాచకొండ సీపీ కీలక ఆదేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 12:సీఎం రేవంత్ రెడ్డి , మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఉప్పల్ స్టేడియం వేదికగా జరుగనున్న ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఫుట్‌బాల్ మ్యాచ్ టికెట్లు కూడా హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. రేవంత్, మెస్సీ మ్యాచ్ నేపథ్యంలో రాచకొండ సీపీ సుధీర్ బాబు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈరోజు (శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచే ఈవెంట్ ఇది అని అన్నారు.

రేపు (శనివారం) సాయంత్రం 7 గంటల నుంచి ఎనిమిది గంటల వరకు మ్యాచ్ జరుగనుందని.. మ్యాచ్ నందర్భంగా అందరూ క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. స్టేడియం దగ్గర పాసులు అమ్మబడవని... ఇప్పటికే ఆన్‌లైన్‌లో పాసులను విక్రయించినట్లు చెప్పారు. పాసులు లేని వారు స్టేడియం వద్దకు రావద్దన్నారు. మెస్సీకి జి కేటగిరి భద్రత ఏర్పాటు చేశామని.. గ్రీన్ చానెల్ ద్వారా మెస్సీ ప్రయాణం చేస్తారని వెల్లడించారు. మ్యాచ్ లైవ్ టెలికాస్ట్ ఉంటుందని.. టికెట్స్ లేని వారు ఇంట్లో ఉండి టీవీలో చూడాలని కోరారు. మ్యాచ్‌కు వచ్చే వారు మూడు గంటల ముందే స్టేడియంకు చేరుకోవాలని... ఆలస్యంగా వచ్చే వారిని అనుమతించమని స్పష్టం చేశారు. మ్యాచ్ కోసం వచ్చే వారు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను వినియోగించాలని సూచించారు. వ్యక్తిగత వాహనాలు తీసుకురావడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని తెలిపారు.

మహిళల అంధుల క్రికెట్ జట్టును అభినందించిన పవన్ కల్యాణ్

అమరావతి, డిసెంబర్ 12:ప్రపంచ కప్ విజేత, మహిళల అంధుల భారత క్రికెట్ జట్టు ను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభినందించారు. ఈ మేరకు మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో క్రికెటర్లు, శిక్షకులు, సహాయక సిబ్బందితో శుక్రవారం భేటీ జరిగింది.

ఈ సందర్భంగా ప్రపంచ కప్ సాధించిన క్రికెటర్లను అభినందించి, ఒక్కో మహిళా క్రికెటర్ కు రూ.5 లక్షల చొప్పున, శిక్షకులకు రూ.2 లక్షల చొప్పున చెక్కులు అందించారు. ప్రతి మహిళ క్రికెటర్ కు పట్టు చీర, శాలువాతోపాటు జ్ఞాపిక, కొండపల్లి బొమ్మలు, అరకు కాఫీతో కూడిన బహుమతులను అందించి సత్కరించారు. మహిళా అంధ క్రికెటర్లు సాధించిన విజయం దేశానికే గర్వకారణమని ప్రశంసించారు.

అంధ క్రికెటర్ల ప్రాక్టీస్ కోసం ప్రత్యేక నదుపాయాలు కల్పించాలని, అన్ని విధాలా అండగా నిలవాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు స్వయంగా విజ్ఞప్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఏపీలో కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని, మహిళా క్రికెటర్లు తెలిపిన అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు.

కేబినెట్ హోదాలపై పిల్.. హైకోర్టు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలతో సహా కొందరికీ కేబినెట్ హోదా కల్పిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఓ జీవో ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ జీవోను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేత ఏర్రోళ్ల శ్రీనివాస్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిల్‌పై ఇవాళ(శుక్రవారం) విచారణ జరిగింది.

కాంగ్రెస్ నేతలు కేశవరావు , పోచారం శ్రీనివాసరెడ్డి , సుదర్శన్ రెడ్డి, ప్రేమ్‌సాగర్, చిన్నారెడ్డిలతోపాటు మరో తొమ్మిది మందికి కేబినెట్ హోదా చట్ట విరుద్ధమని పిటిషన్‌లో ప్రస్తావించారు.

రిజిస్ట్రీ అభ్యం తరం చెప్పడంతో చీఫ్ జస్టిస్ బెంచ్ విచారణ చేపట్టింది. ఎమ్మెల్యేల సంఖ్యలో 15 శాతం మాత్రమే కేబినెట్ హోదా ఇవ్వాల ని వాదనలు వినిపించారు. ముఖ్యమంత్రి, మంత్రులకు మాత్రమే కేబినెట్ హోదా ఉంటుందని వివరించారు ఏర్రోళ్ల శ్రీనివాస్.

రిజిస్ట్రీ అభ్యంతరాలను తోసిపుచ్చి ఓ నెంబర్ కేటాయించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేబినెట్ హోదా కల్పించడాన్ని సవాల్ చేస్తూ 2017లో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిల్ దాఖలు చేశారని గుర్తుచే శారు.

సింగరేణి మండలంలో రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం



ఖమ్మం, డిసెంబర్ 12:సింగరేణి మండలంలోని కారేపల్లి క్రాస్ రోడ్, చీమలపాడు సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు ఏఈలు జి.ప్రీతి, డి.రాజేశ్వరి తెలిపారు. సబ్ స్టేషన్ల మరమ్మతుల దృష్ట్యా కారేపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు అలాగే చీమలపాడు సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈలు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.



భరతమాతను అస్థిరపరిచ చూస్తున్న ఉగ్ర మూర్ఖులు !

(13 డిసెంబర్ "పార్లమెంట్ భవనంపై ఉగ్రవాదుల దాడి" జరిగిన సందర్భంగా)

భారతదేశ గుండెకాయ, "రాజకీయ శక్తి కేంద్రం(పొలిటికల్ పవర్ సెంటర్)" మన రాజధాని ఢిల్లీ మహానగరం. భరతమాత మెదడు వలె నిటారుగా, సగర్వంగా నిలుస్తున్నది "దేశ వాణిజ్య కేంద్రం (ఫైనాన్సియల్ క్యాపిటల్)" ముంబాయి మెగా సిటీ. దేశాన్ని అస్థిరపరచాలనే దుర్బుద్ధితో పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు పలు మార్లు ఈ మహా నగరాలపై బాంబు దాడులు జరపడం, ప్రాణ నష్టం జరగడం, భారత్ సత్వరమే స్పందించి ఉగ్ర మూకల మెడలు తెగ్గోయడం జరుగుతూనే ఉన్నది. బలహీనులైన ఉగ్రవాదులు చేపట్టే విధ్వంస రచనలతో ప్రపంచమే ప్రభావితం అవుతున్నది. భారత్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో అతి ప్రధానమైనదిగా 13 డిసెంబర్ 2001 రోజు భారత పార్లమెంట్ భవనంపై జరిపిన దాడిని గుర్తించాలి. ఈ బాంబు దాడిలో 09 మంది సైనికులు, పార్లమెంట్ సిబ్బందితో పాటు దాడిలో పాల్గొన్న ఐదుగురు ఉగ్రవాదులు ప్రాణాలు కోల్పోగా, 17 మంది గాయపడడం జరిగింది. మన దేశ గుండెను గాయపరచాలని చూస్తున్న ఐదుగురు ముష్కర మూకలను క్షణాల్లో భారత భద్రతా దళాలు మట్టుపెట్టడం జరిగినప్పటికీ, ఈ దుర్ఘటన మన పార్లమెంట్ చరిత్రలో ఒక చెరగని మరకగా మిగిలి పోయింది.

ఢిల్లీ, ముంబాయి మహానగరాల్లో జరిగిన ప్రధాన ఉగ్రదాడులు:

గత దశాబ్ద కాలంగా భారత్‌లో ఉగ్ర మూకలు చేసిన బాంబు దాడుల్లో మార్చి 1993 ముంబాయిలో జరిపిన సీరియల్ బాంబు విస్ఫోటనాల్లో 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా దాదాపు 700 మంది గాయపడడం చూసాం. అనే విధంగా డిసెంబర్ 2000లో న్యూఢిల్లీ ఎర్ర కోట దాడిలో ముగ్గురు మరణించగా, ఆగష్టు 2003లో ముంబాయి బాంబు దాడుల్లో 50 మంది, అక్టోబర్ 2005లో ఢిల్లీ బాంబు దాడుల్లో 50 మంది, జూలై 2006లో ముంబాయి రైలు బాంబు దాడుల్లో 189 మంది, సెప్టెంబర్ 2008లో ఢిల్లీ బాంబు పేలుళ్లలో 25 మంది, నవంబర్ 2008లో ముంబాయి దాడుల్లో 174 మంది, జూలై 2011లో ముంచాయి బాంబు దాడుల్లో 20 మంది, 10 నవంబర్ 2025 రోజు ఢిల్లీ ఎర్ర కోట బాంబు పేలుళ్లలో 10 మంది అమాయక ప్రజలు తమ ప్రాణాలను కోల్పోయారు.

పాక్ ప్రేరేపిత భారత పార్లమెంట్ దాడి-2001:

13 డిసెంబర్ 2001 రోజు పాకిస్థాన్ ప్రేరేపిత లష్కర్-ఏ-తైబా, జైష్-ఈ-మహమ్మదు ఉగ్ర సంస్థలకు చెందిన ఉగ్రవాదులు భారత పార్లమెంట్ దాడిలో ఐదుగురు ఉగ్రవాదులతో పాటు ఆరుగురు ఢిల్లీ పోలీసు సిబ్బంది, ఇద్దరు పార్లమెంట్ సెక్యూరిటీ సిబ్బంది, ఒక తోటమాలి (మొత్తం 14 మంది) తమ ప్రాణాలను కోల్పోయారు. భారత గణతంత్ర ప్రభుత్వ అత్యున్నత శాసన సభ అయిన భారత పార్లమెంట్ భవనం రాజ్యసభ, లోకసభలతో కూడిన ద్విసభగా భరతమాతకు శాంతి సౌభాగ్యాలను అందించే సత్కార్యాలకు పునాదులు వేస్తున్నది. భారత పార్లమెంట్ ప్రాంగణంలోకి నకిలీ గుర్తింపు స్టిక్కర్లు ధరించిన కారులో భద్రతను ఛేదించుకొని ఐదుగురు ఉగ్రవాదులు చొరబడడం జరిగింది. ఏకె-47 రైఫిల్స్, గ్రెనేడ్ లాంచర్లు, పిస్టల్స్, గ్రెనేడ్స్ లాంటి ఆయుధాలతో ప్రవేశించిన ఉగ్రవాదులు కాల్పులు జరపడం ప్రారంభించగా, సత్వరమే తేరుకున్న భద్రతా సిబ్బంది తగు రీతిలో స్పందించి ఆ ఐదుగురు ఉగ్ర ముష్కరులపై పైచేయి సాధించడంతో తీవ్ర పరిణామాలకు అడ్డుకట్ట పడింది. ఉగ్రవాదుల్లో ఒకరు ఆత్మాహుతి చొక్కా పేలి మరణించగా, మిగిలిన నలుగురు ఉగ్రవాదులు భద్రతా సిబ్బంది చేతుల్లో మరణించారు. ఈ దుర్ఘటనలో దాదాపు 17 మంది గాయపడ్డారు.

పాకిస్థానీ ఐఎస్ఐ హింసాత్మక మార్గదర్శకత్వంలో జరిపిన ఉగ్రవాదుల దాడితో దేశ సమగ్రతను విచ్ఛిన్నం చేయడానికి చేసిన ఉగ్ర ప్రయత్నం విఫలం కావడం మరోసారి జరిగింది. ప్రత్యక్షంగా ఏమీ చేయలేని బలహీన పాకిస్థాన్ తరుచుగా ఇలా దొంగచాటుగా అజ్ఞాన ఉగ్ర మృగాలను ఆయుధాలుగా చేసుకొని భారత్‌ను అస్థిరపరచాలనే పన్నాగాలు ఎన్నటికీ సఫలం కావని తెలుసుకోవాలి. ప్రతి దాడిలో కొన్ని ప్రాణాలు కోల్పోవచ్చు, కాని భరతమాత శాంతి పావురం ఎన్నటికీ చెక్కుచెదరదని ఉగ్రవాదులు, పాకిస్థానీ ఐఎస్ఐ గమనించాలి. తినడానికి తిండి లేదు కాని ఆయుధాలు కొనడానికి ఉత్సాహపడడం పాకిస్థాన్ అనైతిక నైజంగా మారింది. ప్రపంచాన్ని చెదలు రూపంలో పట్టి పీడిస్తున్న ఉగ్రవాద ఊడల్ని నిర్దయగా పెకిలించి బూడిద చేయాల్సిందే. ఉగ్రమూకల ప్రాణాల్ని మట్టుపెట్టాల్సిందే.

- ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

జాతీయ ఛాంపియన్‌షిప్‌కు ఆక్స్ఫర్డ్ పాఠశాల విద్యార్థులు ఎంపిక..

నిజామాబాద్,డిసెంబర్ 12:ఆక్స్ఫర్డ్ పాఠశాలకు చెందిన 3వ తరగతి విద్యార్థి మంగళారపు ప్రణవ్ కుమార్, 5వ తరగతి విద్యార్థి పిడుగు శివ, జాతీయ ఛాంపియన్‌షిఎ)కు ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్ తెలిపారు. ఈ పోటీలు డిసెంబర్ 18న హైదరాబాద్‌లోని కేఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో లీడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడనున్నాయని ఆయన అన్నారు.

నవంబర్ చివరి వారం రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ చూపిన ఈ ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. మంగళారపు ప్రణవ్ కుమార్ జాతీయ సైన్స్ ఛాంపియన్‌షిప్‌కు, పిడుగు శివ జాతీయ ఇంగ్లీష్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్, అడ్మినిస్ట్రేటర్ పద్మ, అకాడమిక్ కోఆర్డినేటర్ జ్యోతి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి, సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

ఈ సందర్భంగా కరస్పాండెంట్ మానస గణేష్ మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, రాబోయే పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమకు,తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు, ప్రతిష్ఠ తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జోర్డాన్, ఇథియోపియా, ఒమన్‌లలో ప్రధాని పర్యటన

న్యూఢిల్లీ, డిసెంబర్ 12:మహారాజు అబ్దుల్లా ఎఎ బిన్ అల్ హుస్సేన్ ఆహ్వానం మేరకు.. భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2025 డిసెంబరు 15 ? 16 తేదీల్లో హషేమైట్ రాజ్యమైన జోర్డాన్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటన సందర్భంగా గౌరవ మహారాజు అబ్దుల్లా ఎఎ బిన్ అల్ హుస్సేన్‌తో భారత ప్రధాన మంత్రి సమావేశమై.. భారత్, జోర్డాన్ మధ్య సంబంధాల పూర్తి పరిధిని సమీక్షించడంతోపాటు పలు ప్రాంతీయ అంశాలపైనా చర్చిస్తారు. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలకు 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటన జరుగుతోంది. భారత్ - జోర్డాన్ ద్వైపాక్షిక సంబంధాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి, పరస్పర వృద్ధి, సంక్షేమం కోసం సహకారానికి కొత్త మార్గాల అన్వేషణకు, అలాగే.. ప్రాంతీయ శాంతి, సమృద్ధి, భద్రత, స్థిరత్వాన్ని ప్రోత్సహించడంలో అంకితభావాన్ని పునరుద్ఘాటించేందుకు ఇదో మంచి అవకాశం.

పర్యటన రెండో దశలో భాగంగా.. ఇథియోపియా ప్రధాన మంత్రి డాక్టర్ అబియ్ అహ్మద్ అలీ ఆహ్వానం మేరకు.. భారత ప్రధానమంత్రి 2025 డిసెంబరు 16 - 17 తేదీల్లో ఆ దేశంలో అధికారికంగా పర్యటిస్తారు. ప్రధానమంత్రి శ్రీ మోదీ ఇథియోపియాలో పర్యటించడం ఇదే తొలిసారి. భారత్ - ఇథియోపియా ద్వైపాక్షిక సంబంధాలకు సంబంధించి.. అన్ని అంశాలపైనా వారు విస్తృతంగా చర్చిస్తారు. అభివృద్ధి చెందుతున్న దేశాలుగా.. రెండు దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలను, ద్వైపాక్షిక సహకారాన్ని ముందుకు తీసుకెళ్లే దిశగా ఉమ్మడి నిబద్ధత ను ఈ పర్యటన పునరుద్ఘాటిస్తోంది.

పర్యటన చివరి దశలో భాగంగా, ఒమన్ మహారాజు సుల్తాన్ హైతమ్ బిన్ తారిక్ ఆహ్వానం మేరకు.. భారత ప్రధానమంత్రి 2025 డిసెంబరు 17 ? 18 తేదీల్లో ఆ దేశంలో పర్యటిస్తారు. ప్రధానమంత్రి శ్రీ మోదీ ఒమన్‌లో పర్యటించడం ఇది రెండోసారి. శతాబ్దాల నాటి స్నేహ సంబంధాలు, వాణిజ్య అనుసంధానాలు, బలమైన ప్రజా సంబంధాల ప్రాతిపదికగా.. భారత్, ఒమన్ సర్వతోముఖ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పంచుకుంటున్నాయి. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధా లకు 70 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని ఈ పర్యటన సూచిస్తుంది. 2023 డిసెంబరులో ఒమన్ సుల్తాన్ భారత్‌లో పర్యటించిన అనంతరం జరుగుతున్న పర్యటన ఇది. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, రక్షణ, భద్రత, సాంకేతికత, వ్యవసాయం, సంస్కృతి రంగాలు సహా ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని సమగ్రంగా సమీక్షించడానికి ఇరుపక్షాలకు ఈ పర్యటన ఒక మంచి అవకాశం. అలాగే పరస్పర ప్రయోజనాలున్న ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపైనా చర్చిస్తారు.

భారత మైనింగ్ సామర్థ్యాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడంలో ప్రవాస భారతీయుల పాత్ర కీలకం: కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, డిసెంబర్ 12:స్వదేశానికి దూరంగా నివసిస్తున్నప్పటికీ, ప్రవాస భారతీయులు దేశంతో గాఢమైన బంధాన్ని కలిగి ఉన్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జీ కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రవాస భారతీయులందరికీ తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రవాసీలు కేవలం విదేశీ మారక ద్రవ్యాన్ని పంపడమే కాకుండా, పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలు, కొత్త అవకాశాలను తీసుకువస్తూ దేశానికి ఎంతో సహాయపడుతున్నారని ఆయన అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రవాస భారతీయులను "దేశ రాయబారులు"గా అభివర్ణించిన విషయాన్ని గుర్తుచేస్తూ.. వారు భారతదేశ ప్రతిష్టను, విలువలను, సామర్థ్యాన్ని ప్రపంచంలోని ప్రతి మూలకు తీసుకువెళ్తున్నారని అన్నారు. రాజస్థాన్‌తో పాటు యావత్ దేశ గనుల తవ్వకాల సామర్థ్యాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో ప్రవాస భారతీయుల పాత్ర కీలకమని మంత్రి పేర్కొన్నారు.రాజస్థాన్ లోని విస్తారమైన సహజ వనరులను ప్రస్తావిస్తూ.. దేశ సాంస్కృతిక వారసత్వానికి రాష్ట్రం ఆభరణం మాత్రమే కాకుండా, గనుల వారసత్వానికి కూడా ఒక నిధిగా మారిందని శ్రీ జీ కిషన్ రెడ్డి చెప్పారు. పురాతన కాలం నుంచి రాజస్థాన్ ఖనిజాల వెలికితీత, గనుల తవ్వకం సాంకేతికతలో అగ్రగామిగా ఉందని పేర్కొన్నారు. నేటికి దేశ ఖనిజ భద్రతకు రాజస్థాన్ వెన్నెముకగా నిలుస్తోందని అన్నారు. పాలరాయి, గ్రానైట్, ఇసుకరాయి, స్లేట్ వంటి వాటిని ఉత్పత్తి, ఎగుమతి చేయడంలో రాష్ట్రం ముందంజలో నిలుస్తుందన్నారు.

దేశంలో మైనింగ్ రంగం నేడు సహకార, పోటీ సమాఖ్యవాద సూత్రాల ఆధారంగా నడుస్తోందని, ఇది దేశ ఖనిజ భద్రతకు, వృద్ధి సామర్థ్యానికి పునాదిగా మారిందని మంత్రి పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో మైనింగ్ రంగం చారిత్రాత్మక సంస్కరణలను చూసిందన్నారు. పారదర్శక వేలం వ్యవస్థను ప్రవేశపెట్టడం, ప్రైవేటు రంగాన్ని పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయడం, అన్వేషణలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతి, వ్యాపారం సులభతరం చేయడంలో గణనీయమైన మెరుగుదల వంటివి ఉన్నాయని చెప్పారు.కొత్త పెట్టుబడులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వాడకం దేశ మైనింగ్ రంగంలో గణనీయమైన అవకాశాలను అందిస్తుందని శ్రీ జీ కిషన్ రెడ్డి తెలిపారు. జాతీయ కీలక ఖనిజాల మిషన్ కోసం రూ.34,300 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఇది కీలక ఖనిజాల అన్వేషణలో దేశాన్ని స్వావలంబనగా మార్చేందుకు దోహదపడుతుందన్నారు. మొదటిసారిగా అన్వేషణ లైసెన్స్‌లను వేలం వేశారని, ఏడు బ్లాకులను విజయవంతంగా వేలం వేయడం తో ఈ ప్రయత్నం ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని పెంచుతుందని, దేశంలో అన్వేషణ ప్రయత్నాలను వేగవంతం చేస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రారంభించిన రూ. 1,500 కోట్ల రీసైక్లింగ్ పథకం ద్వారా వార్షికంగా 3 లక్షల టన్నుల సామర్థ్యాన్ని సృష్టించడం, 2030 నాటికి సుమారు 40,000 టన్నుల కీలక ఖనిజాల పునరుద్ధరణను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి పేర్కొన్నారు.ఇటీవలి సంవత్సరాల్లో దేశం లో బొగ్గు రంగం పూర్తిగా మారి ఎ టోయిందని కేంద్రవంత్రి పేర్కొన్నారు. వాణిజ్య బొగ్గు తవ్వకం ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని గణనీయంగా పెంచిందని, దీని వల్ల అధిక ఉత్పత్తి, బలమైన పోటీ, మెరుగైన కార్యాచరణ సామర్థ్యం ఏర్పడిందన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో బొగ్గు గ్యాసిఫికేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించామని, గణనీయమైన పెట్టుబడులను ఆకర్షించేందుకు ఇది సహకరిస్తుందని తెలిపారు. దేశంలో తొలిసారి భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ బ్లాక్‌లను కూడా వేలం వేశారని మంత్రి చెప్పారు.

దేశ మైనింగ్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులకు, అంతర్జాతీయ పోటీ సామర్థ్యానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని కేంద్రమంత్రి తెలిపారు. ఈ అవకాశాలను సాకారం చేసుకోవడంలో ప్రవాస భారతీయుల పాత్ర అత్యంత కీలకమని మంత్రి స్పష్టం చేశారు. భారత మైనింగ్ రంగం అపారమైన అవకాశాల ముంగిట నిలబడి ఉందని, దీనికి ప్రవాసుల శక్తి, దార్శనికత, ప్రపంచ అనుభవం అవసరమని అన్నారు. భారత వ్యూహాత్మక సామర్థ్యాలను బలోపేతం చేయడానికి విదేశాల్లో కీలక ఖనిజాల సేకరణలో కబిల్ వంటి సంస్థలతో కకలిసి పనిచే యాలని వారిని ప్రోత్సహించారు. రాజస్థాన్‌ను అవకాశాల రాజధాని గా, భారత్‌ను ప్రపంచ మైనింగ్ శక్తిగా మార్చడంలో భాగస్వామ్యం అవ్వాలని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయులకు పిలుపునిస్తూ కేంద్రమంత్రి శ్రీ జీ కిషన్ రెడ్డి తన ప్రసంగాన్ని ముగించారు.

జైన గ్రామాభివృద్ధి కోసం గెలిపించాలి..

హైదరాబాద్, డిసెంబర్ 12: తనకు ఒక్కసారి సర్పంచ్ గా గెలిపిస్తే జైన గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా నిలిపి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని జైన సర్పంచ్ అభ్యర్థి కట్ట రమాదేవి భువనేశ్వర్ తెలిపారు. ఇవాళ గ్రామంలో ఇంటింటా ప్రచారం చేస్తూ ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. విద్యావంతురాలైన తనను గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని రాష్ట్ర సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో గ్రామానికి నిధులు తీసుకువచ్చి గ్రామంలో అభివృద్ధి చేపడతానని రమాదేవి ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రతినిత్యం ప్రజలతో ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని.. ఒక్కసారి అవకాశం కల్పించి గెలిపించాలని ఆమె ఓటర్లను కోరారు. జైన గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మద్దతు తెలిపారు.

అవకాశం కల్పిస్తే.. మరింత అభివృద్ధి చేస్తా..

-నాగిరెడ్డిపల్లి కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి గోవింద్ గౌడ్.

ఆదిలాబాద్, డిసెంబర్ 12:నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీని మొదటిసారి తన భార్య స్వాతికి అవకాశం ఇచ్చి గెలిపించారని, మరోసారి తనకు అవకాశం కల్పిస్తే మంత్రి సహకారంతో మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని నాగిరెడ్డిపల్లి కాంగ్రెస్ సర్పంచ్ మద్దతు అభ్యర్థి గోవింద్ గౌడ్ అన్నారు. ఇవాళ నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా మద్దతుదారులతో కలిసి ఇంటింటి ప్రచారం ముమ్మరంగా చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ? గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యలు పరిష్కరించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేయించే బాధ్యత తీసుకుంటానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు నిరుపేదలకు వచ్చే విధంగా చూస్తానని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని ప్రతి సమస్యను తెలుసుకున్న వ్యక్తిగా తనను ఆదరించి గెలిపిస్తే గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. గ్రామ అభివృద్ధికి నిస్వార్థంగా సేవ చేసే భాగ్యం కల్పించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు.

గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి పారదర్శకంగా అందిస్తానన్నారు. మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సహకారంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. ఆదరించి ఓటు వేసి గెలిపిస్తే నాగిరెడ్డిపల్లి గ్రామ రూపురేఖలు మారుస్తామన్నారు. తన భార్య స్వాతి సర్పంచ్ గా ఐదేళ్లు పాలన చేపట్టడంతో సమస్యలపై పూర్తి పట్టు ఉన్న తనను గెలిపించి గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వాతిగౌడ్, వార్డు అభ్యర్థులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర నీరు ఆపేస్తారు

కర్నూలు, డిసెంబర్ 12: వచ్చే ఏడాది జనవరి 10 తర్వాత తుంగభద్ర నది ద్వారా అందే నీటి పారుదల నిలిపివేయనున్న నేపథ్యంలో నగర ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు వెంటనే తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎన్బిఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ఇంజనీరింగ్ విభాగం, అమెనిటీస్ విభాగం, తాగునీటి విభాగ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తుంగభద్ర నీటి నిలుపేత అనంతరం వేసవి కాలంలో నగరానికి అవసరమైన నీటి సరఫరా నిరాటంకంగా కొనసాగించేందుకు ట్యాంకుల శుభ్రపరిచే పనులు, ప్రత్యామ్నాయ బోర్లు, మోటారుల మరమ్మతులు, పవర్ బోర్ల వినియోగం, ట్యాంకర్ సప్లై వంటి చర్యలను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ప్రాంతంలో లీకేజీలను పూర్తిగా నియంత్రించి, పైపులైన్ మరమ్మతులను రోజువారీగా పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఇంచార్జీ ఎన్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, ఏఈలు, ట్యాబ్ ఇంస్పెక్టర్లు, ఫిట్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్ బాల్ గుర్తుకు ఓటు వేయండి..

కరీంనగర్, డిసెంబర్ 12: ఫుట్ బాల్ గుర్తుకు ఓటు వేసి ఒక్కసారి జైన గ్రామ సర్పంచ్ గా గెలిపించాలని జైన గ్రామ సర్పంచ్ అభ్యర్థి గడ్డి లక్ష్మి రాజం ఓటర్లను కోరారు. ఈ రోజు గ్రామంల ఇంటింటా తిరుగుతూ ఫుట్బాల్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. తనకు ఒక అవకాశం కల్పిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

నిత్యం ప్రజలకు ఉంటూ సేవ చేస్తూ గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు.గ్రామాన్ని ఆదర్శంగా నిలుపుతానని హామీ ఇచ్చారు

తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో
డా॥ మాడభూషి రంగాచార్య స్మారక కమిటీ
1-7-79, చైతన్యపురి, హైదరాబాద్-500060. సెల్ నెంబర్: 9440444019
ద్విదశాబ్ది సభ
స్మరణ (గ్రంథావిష్కరణ)
వేదిక: రవీంద్రభారతి, సమావేశ మందిరం, మొదటి అంతస్థు, హైదరాబాద్
సమయం: 14 డిసెంబర్ 2025 ఆదివారం సాయంకాలం 5.30 నిll లకు
అధ్యక్షులు : డా॥ డి. చంద్రశేఖరరెడ్డి
ముఖ్య అతిథి, గ్రంథావిష్కరణ : నిఖిలేశ్వర్
విశిష్ట అతిథి : డా॥ ఏనుగు నరసింహారెడ్డి
వక్తలు : సుధామ
డా॥ నాళేశ్వరం శంకరం
డా॥ బెల్లంకొండ సంపత్ కుమార్
డా॥ జతిన్ కుమార్
శీలా సుభద్రాదేవి
అధ్యక్షులు
అందరూ ఆహ్వానితులు
మాడభూషి లలితాదేవి
కన్వీనర్

ఆన్‌లైన్ తత్కాల్ టికెట్ల కోసం 322 రైళ్లలో, రిజర్వేషన్ కౌంటర్ల ద్వారా 211 రైళ్లలో ఆధార్ ఆధారిత ఓటీపీ ధృవీకరణ తప్పనిసరి

న్యూఢిల్లీ, డిసెంబర్ 12:భారతీయ రైల్వే రిజర్వేషన్ టికెట్ బుకింగ్ వ్యవస్థ పరిశ్రమ ప్రమాణాలకు అనుగుణంగా.. అత్యాధునిక సైబర్ భద్రతా నియంత్రణలతో కూడిన దృఢమైన, అత్యంత సురక్షితమైన సాంకేతిక వేదిక.రిజర్వేషన్ వ్యవస్థ పనితీరును, సాధారణ/తత్కాల్ టిక్కెట్ల లభ్యతను మెరుగుపరిచేందుకు భారతీయ రైల్వే అనేక చర్యలు చేపట్టింది. వాటిలో కొన్ని..

వినియోగదారు ఖాతాల ధృవీకరణ, పరిశీలన జరిగింది .2025 జనవరి నుంచి ఇప్పటి వరకు సుమారు 3.02 కోట్ల అనుమానాస్పద వినియోగదారు ఖాతాలు నిలిపివేసింది.

నిజమైన ప్రయాణీకులకు సులభంగా బుకింగ్ జరిగేలా చూడటానికి, నకిలీ వినియోగదారులను తొలగించేందుకు అకామై (ఏకేఏఎమ్ఏఐ) వంటి యాంటీ బాట్ పరిష్కారాలను రైల్వే వ్యవస్థ అమలు చేస్తుంది.

ఆన్‌లైన్ తత్కాల్ టికెట్ బుకింగ్‌లో దుర్వినియోగాన్ని అరికట్టడానికి, పారదర్శకతను మెరుగుపరచడానికి ఆధార్-ఆధారిత వన్-టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) ధృవీకరణను దశలవారీగా ప్రవేశపెట్టింది. డిసెంబర్ 4 నాటికి 322 రైళ్లలో ఈ విధానం అమలులో ఉంది. ఈ చర్యల కారణంగా 322 రైళ్లలో సుమారు 65 శాతం ధ్రువీకరించిన తత్కాల్ టికెట్ లభ్యత సమయం పెరిగింది.

రిజర్వేషన్ కౌంటర్లలో చేసే తత్కాల్ బుకింగ్‌ల కోసం కూడా ఆధార్-ఆధారిత ఓటీపీని దశలవారీగా ప్రవేశపెట్టింది. ఇది డిసెంబర్ 4 నాటికి 211 రైళ్లలో అమలవుతుంది.

ఈ చర్యల ఫలితంగా 96 ప్రముఖ రైళ్లలో సుమారు 95 శాతం నిర్ధారిత తత్కాల్ టికెట్ లభ్యత సమయం పెరిగింది.

అనుమానాస్పదంగా బుక్ చేసిన పీఎన్ఆర్ ల కోసం జాతీయ సైబర్ నేర వేదికలో ఫిర్యాదులు దాఖలు చేయవచ్చు.

భారతీయ రైల్వే రిజర్వేషన్ వ్యవస్థను సైబర్ బెదిరింపుల నుంచి రక్షించేందుకు అనేక చర్యలు చేపట్టింది. వాటిలో నెట్‌వర్క్ ఫైర్‌వాల్‌లు, చొరబాటు నివారణ వ్యవస్థలు, అప్లికేషన్ డెలివరీ కంట్రోలర్లు, వెబ్ అప్లికేషన్ ఫైర్‌వాల్‌లు ఉన్నాయి. ఈ వ్యవస్థ ప్రత్యేకమైన,ప్రవేశ నియంత్రణ కలిగిన డేటా సెంటర్‌లో సీసీటీవీ నిఘా ద్వారా, ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ ద్వారా సురక్షితంగా ఉంటుంది. ఈ డేటా సెంటర్ ఐఎస్ఓ 27001 సమాచార భద్రతా నిర్వహణ వ్యవస్థ ప్రమాణాల ప్రకారం ధృవీకరించింది.

సైబర్ భద్రతా స్థానాన్ని మరింత బలోపేతం చేయడానికి, భారత రైల్వే టెలికమ్యూనికేషన్స్ సంస్థ సమగ్ర సైబర్ ముప్పు నిఘా సేవలను అందిస్తుంది. వీటిలో టేక్-డౌన్ సేవలు, బెదిరింపుల పర్యవేక్షణ, లోతైన, చీకటి వెబ్ నిఘా, డిజిటల్ రిస్క్ రక్షణ ఉన్నాయి. ఈ సేవలు కొత్తగా తలెత్తుతున్న సైబర్ బెదిరింపులపై చురుకైన, క్రియాశీల చర్యలను అందిస్తాయి. దీని ద్వారా సంఘటన జరిగినప్పుడు వేగవంతమైన ప్రతిస్పందన సాధ్యమవుతుంది.

రిజర్వేషన్ వ్యవస్థకు సంబంధించిన భద్రతా ఆడిట్‌లను సీఈఆర్-ఇన్ ఆమోదించిన సమాచార భద్రతా ఆడిట్ సంస్థలు నిర్వహిస్తాయి. సైబర్ దాడులను గుర్తించి నిరోధించడానికి టికెటింగ్ వ్యవస్థకు సంబంధించిన ఇంటర్నెట్ ట్రాఫిక్‌ను సీఈఆర్-ఇన్, జాతీయ కీలక సమాచార మౌలిక వసతుల రక్షణ కేంద్రం(ఎన్ సీఐఐపీసీ) నిరంతరం పర్యవేక్షిస్తాయి.

రైల్వే బోర్డు, జోనల్ రైల్వేలు, డివిజనల్ కార్యాలయాలు వంటి వివిధ స్థాయిల్లో ప్రజా ప్రతినిధులు, సంస్థలు, రైలు వినియోగదారులు మొదలైన వారి నుంచి అధికారికంగా, అనధికారికంగా వచ్చే విజ్ఞప్తులు,సూచనలు, అభ్యర్థనలను నిరంతరం స్వీకరిస్తారు.ఇలాంటి అభ్యర్థనలు, సూచనలు స్వీకరించడం నిరంతర ప్రక్రియ కాబట్టి ఈ అభ్యర్థనలను కేంద్రీకృతంగా నిర్వహించడం వీలు కాదు.

అయినప్పటికీ వీటిని పరిశీలించి సాధ్యమయ్యే, సమర్థించదగిన చర్యలను ఎప్పటికప్పుడు తీసుకుంటున్నారు. ఇది ఒక నిరంతర ప్రక్రియ.

ఈ సమాచారాన్ని కేంద్ర రైల్వే,సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో అడిగిన ఓ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంలో అందించారు.

వారణాసిలో భారత తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ నౌక ప్రయాణికుల సేవలను ప్రారంభించిన సర్బానంద సోనోవాల్

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: పర్యావరణ పరిరక్షణ ప్రయత్నాల్లో భారత్ మరో విజయ ప్రస్థానాన్ని అందుకుంది. ఈరోజు వారణాసి లోని నమో ఘాట్‌లో పూర్తి దేశీయ తొలి హైడ్రోజన్ ఆధారిత నౌక వాణిజ్య కార్యకలాపాలను కేంద్ర నౌకాశ్రయాలు, నౌకాయానం, జలరవాణా మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రారంభించారు.

దేశ సముద్ర రంగంలో హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్‌తో నడిచే పూర్తి స్వదేశీ సాంకేతికతను ఈ నౌక కలిగి ఉంది. ఇది తక్కువ ఉష్ణోగ్రత గల ప్రోటాన్ ఎక్స్‌చేంజ్ మెంబ్రేన్ ఫ్యూయల్ సెల్ వ్యవస్థ ఆధారంగా పనిచేస్తూ నిల్వ చేసిన హైడ్రోజన్‌ను విద్యుత్తుగా మారుస్తుంది. ఈ ప్రక్రియలో నీటిని మాత్రమే ఇది విడుదల చేస్తుంది.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ, "ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి చైతన్యవంతమైన, దార్శనిక నాయకత్వంలో భారత్ పరిశుద్ధమైన, సుస్థిరమైన, స్వయం-సమృద్ధి గల రవాణా వ్యవస్థ దిశగా పరివర్తనాత్మక మార్పును సాధిస్తోంది. మన తొలి స్వదేశీ హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ నౌక ప్రారంభం... మేక్ ఇన్ ఇండియా పట్ల ప్రధానమంత్రి నిబద్ధతకు, అన్ని రంగాల్లో హరిత ఇంధన రవాణా వ్యవస్థ దిశగా వస్తున్న పరివర్తనకు ఒక చక్కని ఉదాహరణ. ఈ విజయం మన పవిత్ర గంగానదిని పునరుజ్జీవింపజేసే, సంరక్షించే విస్తృత లక్ష్యాన్నీ బలపరుస్తుంది. మన జలరవాణాలో హరిత సాంకేతికతలను అభివృద్ధి చేస్తున్నప్పుడు... ఆవిష్కరణలను ప్రోత్సహించడమే కాకుండా అభివృద్ధిని పర్యావరణ బాధ్యతతో కలిసి ఉండేలా మేం చూసుకుంటున్నాం. మన దేశానికి హరిత, సుసంపన్న సముద్ర భవిష్యత్తును నిర్మించాలనే ప్రధానమంత్రి అచంచలమైన సంకల్పాన్ని నేటి విజయం ప్రతిబింబిస్తుంది'' అన్నారు.

ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా యాజమాన్యంలో ఈ నౌకను కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ నిర్మించింది. పరీక్షలు పూర్తయిన తర్వాత ఈ నౌక నేటి నుంచీ తన సేవల్ని అందిస్తోంది. 2070 నాటికి నికర-సున్నా ఉద్గారాలను చేరుకోవాలనే ప్రభుత్వ నిబద్ధతకు అనుగుణంగా ఈ నౌక ప్రారంభం... దేశంలోని లోతట్టు జలమార్గాల్లో పరిశుద్ధ, సుస్థిర ఇంధనాలను అభివృద్ధి చేయు మంత్రిత్వ శాఖ ప్రయత్నాలకు మద్దతునిస్తుంది.

హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ నౌక వాణిజ్య సేవల ప్రారంభం... పరిశుద్ధ, సుస్థిర సముద్ర రంగాన్ని నిర్మించే ప్రయత్నంలో కీలక ముందడుగును సూచిస్తుంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి సోనోవాల్‌ల నాయకత్వంలో ఐడబ్ల్యూఏఐ మారిటైమ్ ఇండియా విజన్ 2030, మారిటైమ్ అమృత్ కాల్ విజన్ 2047లో భాగంగా అధునాతన పర్యావరణ సాంకేతికతలు, ప్రత్యామ్నాయ ఇంధనాల అమలును ప్రోత్సహిస్తోంది.

"ఈ హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ నౌకను విజయవంతంగా ప్రారంభించడం... పరిశుద్ధ, సుస్థిర జలరవాణా దిశగా భారత పరివర్తనను వేగవంతం చేయడం పట్ల మంత్రిత్వ శాఖ లోతైన నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

ఈ మార్గదర్శక నౌకను అందించిన కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌ను, కఠినమైన పరీక్షల తర్వాత దీనిని వాణిజ్య సేవలలోకి తీసుకున్న ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీని నేను అభినందిస్తున్నాను. 2070 నాటికి భారత్ నికర-సున్నా ఉద్గారాల లక్ష్యాన్ని చేరుకోవాలనే, అంతర్గత జల రవాణా రంగంలో అత్యాధునిక హరిత సాంకేతికతలను ఏకీకృతం చేయాలనే మా సంకల్పానికి ఈ విజయం నిదర్శనం. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పరివర్తనాత్మక మారిటైమ్ ఇండియా విజన్ 2030, మారిటైమ్ అమృత్ కాల్ విజన్ 2047 దీర్ఘకాలిక రోడ్‌మ్యాప్ మార్గనిర్దేశంలో దేశం కోసం ఆధునిక, ఇంధన-సమర్థ వినియోగం, పర్యావరణ బాధ్యతతో కూడిన సముద్ర రంగాన్ని స్థిరంగా రూపొందిస్తున్నాం'' అని శ్రీ సోనోవాల్ పేర్కొన్నారు.

పట్టణ రవాణా కోసం 24 మీటర్ల కాటమరాన్‌గా రూపొందించిన ఈ నౌక ఎయిర్ కండిషన్ గల క్యాబిన్‌లో 50 మంది ప్రయాణికులను తీసుకెళ్లగలదు. ఇది 6.5 నాట్ల వేగంతో నడుస్తుంది. దీని హైబ్రిడ్ ఎనర్జీ సిస్టమ్ హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్స్, బ్యాటరీలు, సౌర శక్తిని మిళితం చేస్తుంది. ఒకే హైడ్రోజన్ ఫిల్‌పై ఎనిమిది గంటల వరకు పనిచేయడానికి ఇది వీలు కల్పిస్తుంది. ఈ నౌకను ఇండియన్ షిప్పింగ్ రిజిస్టర్ ధ్రువీకరించింది.

పైలట్ నౌక ఎఫ్‌సీవీ పైలట్-01 కార్యకలాపాలను ప్రారంభించడం కోసం ఐడబ్ల్యూఏఐ, కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, ఇన్‌ల్యాండ్ - కోస్టల్ షిప్పింగ్ లిమిటెడ్‌లు సాంకేతిక మద్దతు, కార్యకలాపాలు, పర్యవేక్షణకు సంబంధించిన త్రైపాక్షిక ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ ఒప్పందంలో ఆర్థిక నిబంధనలు, భద్రతా విధానాలు, పర్యవేక్షణ విధానాలు, పైలట్ దశలో కాలానుగుణ తనిఖీలకు సంబంధించిన నిబంధనలు ఉన్నాయి.

వారణాసిలో ప్రారంభించిన హైడ్రోజన్ ఆధారిత నౌక పట్టణ జల రవాణాకు అనేక కీలక ప్రయోజనాలను అందిస్తుంది. వాటిలో ప్రయాణికులు, యాత్రికులకు శబ్ద రహిత ప్రయాణం, ఉద్గారాలుగా నీటిని మాత్రమే అందిస్తూ పొగ, కాలుష్యం లేకుండా జలమార్గాల ద్వారా వేగవంతమైన ప్రయాణం, రహదారిపై రద్దీని తగ్గించడం వంటివి ఈ ప్రయోజనాల్లో భాగంగా ఉన్నాయి. ఇది స్థానికంగా పర్యాటకం, ఉద్యోగ అవకాశాలను పెంపొందించడంతో పాటు, హైడ్రోజన్-ఇంధనంతో నడిచే ప్రయాణికుల రవాణాను అమలు చేస్తున్న ప్రపంచంలోనే తొలి నగరంగా వారణాసిని నిలుపుతుందని భావిస్తున్నారు. సాంకేతికంగా, పూర్తిగా ఎయిర్ కండిషన్‌తో గల 50-సీట్ల ఈ నౌక నిల్వ చేసిన హైడ్రోజన్‌పై ఎనిమిది గంటల పాటు 7 నుంచి 9 నాట్ల వేగంతో నడుస్తుంది. సురక్షితమైన, సమర్థమైన కార్యకలాపాలను నిర్ధారిస్తూ స్వదేశీ, పర్యావరణ హితమైన సాంకేతికత ద్వారా పనిచేస్తుంది.

ఈ నౌక తన తొలి ప్రయాణంలో నమో ఘాట్ నుంచి లలితా ఘాట్ వరకు ఐదు కిలోమీటర్ల దూరం ప్రయాణించింది. గంగా నదిపై హైడ్రోజన్ ఇంధనంతో నడిచే ఈ ప్రయాణికుల నౌక (జాతీయ జలమార్గాలు 1) వాణిజ్య కార్యకలాపాల ప్రారంభాన్ని సూచిస్తూ మంత్రులు, సీనియర్ అధికారులతో పాటు ఇతరులతో కూడిన పరివారాన్ని విజయవంతంగా తీసుకెళ్లింది.

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నుంచి సహాయ మంత్రి (స్వతంత్ర) రవీంద్ర జైస్వాల్, రవాణా మంత్రి దయాశంకర్ సింగ్, సహాయ మంత్రి (స్వతంత్ర) డాక్టర్ దయాశంకర్ మిశ్రా 'దయాలు' వంటి ప్రముఖ నాయకులు కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ వెంట ఉన్నారు. వారణాసి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అశోక్ కుమార్ తివారీ, ఎమ్మెల్యేలు - అవధేష్ సింగ్, నీల్కాంత్ తివారీ, డాక్టర్ సునీల్ పటేల్, సౌరభ్ శ్రీవాస్తవ, అనిల్ రాజ్‌భర్, నీల్ రతన్ సింగ్, త్రిభువన్ రామ్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఐఏఎస్, ఎమ్ఓపీ ఎస్‌డబ్ల్యూ కార్యదర్శి విజయ్ కుమార్... ఐడబ్ల్యూఏఐ చైర్మన్, ఐఏఎస్ సునీల్ పలివాల్... మంత్రిత్వ శాఖ, ఐడబ్ల్యూఏఐ, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన పలువురు సీనియర్ అధికారులూ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హైబ్రిడ్ ఎలక్ట్రిక్ కాటమరాన్‌లను ప్రవేశపెట్టిన తర్వాత... ఈ హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ నౌకను ప్రారంభించడం దేశ అంతర్గత జల రవాణా వ్యవస్థను ఆధునికీకరించడం, పర్యావరణ హితం కోసం ఐడబ్ల్యూఏఐ దీర్ఘకాలిక ప్రణాళికను మరింత బలోపేతం చేస్తోంది.

అదుపుతప్పి లారీ బోల్తా..

-రైలు కింద పడి లారీ డ్రైవర్ ఆత్మహత్య

ఆదిలాబాద్, డిసెంబర్ 12:ఆదోని మండల పరిధిలోని బైచిగేరి గ్రామ సమీపంలో ఆదోని నుంచి ఎమ్మిగనూరు వైపు వెళ్తున్న లారీ ఆదుపుతప్పి బోల్తా పడింది. దీంతో లారీలు ఉన్న ఆరుగురికి గాయాలయ్యాయి. అయితే షాక్ గురైన లారీ డ్రైవర్ లక్ష్మన్న పట్టణంలోని పాత ఓవర్ బ్రిడ్జి వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. డ్రైవర్ ఆత్మహత్య ఎందుకు చేసుకున్నాడో అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

విశాఖలో ఐటీ ఎకో సిస్టం..

-స్టార్టప్ కంపెనీలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం
-టూరిజానికే కాదు..టెక్నాలజీకి కేంద్రంగా విశాఖ
-135 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా విశాఖ ఎకనమిక్ రీజియన్
-కాగ్నిజెంట్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
-25 వేల ఉద్యోగాలు కల్పిస్తామని సీఎం సమక్షంలో కాగ్నిజెంట్ సీఈఓ ప్రకటన

విశాఖపట్నం, డిసెంబర్ 12: విశాఖలో ఐటీ ఎకోసిస్టం ఏర్పడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల విశాఖ ఐటీ కేంద్రంగా అవతరిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. విశాఖపట్నంలోని కాపులుప్పాడ ఐటీ హిల్స్‌లో ప్రముఖ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు.

25 వేల మంది ఉద్యోగులు పనిచేసేలా అత్యాధునిక వసతులతో క్యాంపస్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. మొత్తం రూ.1,583 కోట్ల పెట్టుబడితో 2033 నాటికి 3 దశల్లో కాగ్నిజెంట్ టెక్నాలజీస్ క్యాంపస్ పూర్తి కానుంది. 2026 నాటికి మొదటి దశ నిర్మాణాన్ని కాగ్నిజెంట్ పూర్తి చేసుకోనుంది. అప్పటివరకు తాత్కాలిక కార్యాలయంలో కార్యకలాపాలు కొనసాగనున్నాయి. ప్రధానంగా ఏఐ, మెషీన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజినీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలపై కాగ్నిజెంట్ దృష్టి సారించింది.

కాగ్నిజెంట్ క్యాంపస్ శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ"ఇన్ హౌస్ కంపెనీగా ఉన్న కాగ్నిజెంట్ ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా పనిచేస్తోంది. చెన్నై, హైదరాబాద్, బెంగుళూరు, కలకత్తా, పూణేలో కాగ్నిజెంట్ సంస్థ కార్యకలాపాలు ఉన్నాయి. ఇప్పుడు విశాఖలోనూ కాగ్నిజెంట్ అడుగుపెట్టింది. హ్యాపెనింగ్ సిటీ విశాఖకు రావాలని కాగ్నిజెంట్ ను ఆహ్వానించాం.

త్వరలో 25 వేల మందితో పనిచేసే కేంద్రంగా కాగ్నిజెంట్ త్వరలోనే తయారు కావాలి. 34 బిలియన్ డాలర్ల పెట్టుబడితో కాగ్నిజెంట్ కార్యకలాపాలను ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తోంది. కాగ్నిజెంట్ లో 85 శాతం మంది భారతీయులే. ఆ సంస్థ సీఈఓ కూడా భారతీయుడే కావటం విశేషం. భవిష్యత్తులో విశాఖ క్యాంపస్ లో లక్ష మంది ఉద్యోగులతో పని చేయాలి. ప్రపంచ వ్యాప్తంగా ఫాస్టెస్ట్ గ్రోయింగ్ కంపెనీగా కాగ్నిజెంట్ ఎదుగుతోంది. గతంలో హైదరాబాద్ లో నాటి టీడీపీ ప్రభుత్వం రూపొందించిన ఎకో సిస్టంతో ఐటీ నిపుణులు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించారు.

దశాబ్దాల క్రితం చేసిన విజన్ తోనే దిగ్గజ ఐటీ కంపెనీలకు భారతీయులు నాయకత్వం ఇస్తున్నారు. 1995లో వచ్చిన ఇంటర్నెట్ రివల్యూషన్ తో పాటు ఐటీ ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్ తీసుకున్నాం. అందుకే ఐటీకి బ్యాక్ బోన్ గా భారతీయులు నిలిచే పరిస్థితి వచ్చింది. ఇప్పుడు ఏఐ విషయంలో కూడా ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్ తీసుకోవాలని భావిస్తున్నాం. ఆ దిశగానే ఏఐ, డేటా సెంటర్లతో విశాఖ ఐటీ డెస్టినేషన్ గా నాలెడ్జి ఎకానమీ కేంద్రంగా తయారవుతోంది." అని సీఎం వెల్లడించారు.

''విశాఖ నగరానికి బెస్ట్ కనెక్టివిటీ ఉండడంతో పాటు? మోస్ట్ లివబుల్ సిటీగా ఉంది. భోగాపురం విమానాశ్రయం, మెట్రో లాంటి అంతర్జాతీయ స్థాయి సదుపాయాలు వస్తాయి. ప్రపంచంలోనే మోస్ట్ హ్యాపెనింగ్ సిటీగా విశాఖ రూపుదిద్దుకు ంటుంది. నౌకాదళ కేంద్రం నుంచి టూరిజం కేంద్రంగా, ఇప్పుడు టెక్ సిటీగా విశాఖ ఎదిగింది.

కాగ్నిజెంట్ తో పాటు 8 సంస్థలకు ఇవాళ భూమి పూజ చేశాం. గూగుల్ కూడా త్వరలోనే డేటా సెంటర్ ను ఏర్పాటు చేయబోతోంది. ఇప్పటికే విశాఖలో 150 టెక్ కంపెనీలు పనిచేస్తున్నాయి. ఈ ప్రాంతంలో నైపుణ్యం సాధించిన యువత ప్రపంచ వ్యాప్తంగా స్థిరపడ్డారు. దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే 20 శాతం జీవన వ్యయం కూడా తక్కువ. ప్రపంచంలోనే బెస్ట్ అండ్ మోస్ట్ లివబుల్ సిటిగా విశాఖను తీర్చిదిద్దుతాం.

దేశంలోనే మహిళలకు అత్యంత సురక్షిత నగరం కూడా విశాఖే. 2032కి 135 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా విశాఖ ఎకనామిక్ రీజియన్ తయారవుతుంది. ఎకరా భూమి 99 పైసలకే ఐటీ కంపెనీలకు ఇవ్వటం ఓ గేమ్ ఛేంజర్. గుజరాత్ లో టాటా నానో కారు తయారీ కేంద్రానికి కూడా 99 పైసలకే ఎకరా చొప్పున భూమి ఇచ్చారు. ఇటీవలే భాగస్వామ్య సదస్సులో 613 ఎంఓయూల ద్వారా రూ. 13.50 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి.

అలాగే ఎస్ఐపీబీల ద్వారా మరో రూ .8.50 లక్షల కోట్ల పెట్టుబడులను ఆమోదించాం. నేషనల్ క్యాంటం మిషన్ ను అందిపుచ్చుకుని ఏపీలోని అమరావతిలో క్యాంటం వ్యాలీని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ కేంద్రం అమరావతిలో ఏర్పాటు కాబోతోంది. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సంస్థలు తమ ప్రధాన కార్యాలయాలను భారతదేశంలో పెట్టుకుంటున్నారు. భారత్ దేశం వైపు ప్రస్తుతం ప్రపంచం మొత్తం చూస్తోంది.

ఈ క్రమంలో ఏపీని, విశాఖను మరింతగా అభివృద్ధి చేస్తున్నాం. ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థలు విశాఖకు వస్తున్నాయి. కాగ్నిజెంట్ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని కూడా విశాఖలో పెట్టాలని కోరుతున్నాను. రాష్ట్రంలోని ఎలక్ట్రానిక్స్, మెడ్ టెక్ జోన్లు ప్రపంచస్థాయి ఉత్పత్తులు తయారు చేస్తున్నాయి.

పరిశ్రమలకు ప్రోత్సాహకాలను ఇచ్చేందుకు ఎస్క్రో ఖాతాను పెడుతున్నాం. ఈ తరహాలో ఆలోచించే ప్రభుత్వాలు ఆర్టీఐహెచ్ ద్వారా స్టార్టప్ లకు సూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతున్నాం. సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులను కూడా రూపొందిస్తున్నాం. 15 శాతం వృద్ధి రేటు సాధించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోంది.

కాగ్నిజెంట్ కార్యాలయ శంకుస్థాపన కార్యక్రమంలో ఆ సంస్థ సీఈఓ రవికుమార్ కీలక ప్రకటన చేశారు. విశాఖ కాగ్నిజెంట్ సంస్థలో 25 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని వెల్లడించారు. 8 వేల మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వంతో కాగ్నిజెంట్ సంస్థ ఒప్పందం చేసుకుంది. అయితే శంకుస్థాపన కార్యక్రమానికి ముందుగా రవికుమార్ తో సీఎం చంద్రబాబు కొద్దిసేపు సంభాషించారు.

8 వేల ఉద్యోగాలు కాదని? విశాఖ క్యాంపస్ లో 25 వేల మందికి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఈ మేరకు శంకుస్థాపన కార్యక్రమం వేదికగా చంద్రబాబు సమక్షంలో 25 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని రవికుమార్ ప్రకటించారు. విశాఖకు రావడం తన సొంతింటికి వచ్చినట్టుందని రవికుమార్ అన్నారు.

విశాఖలో దిగ్గజ కంపెనీలు.. మరో 8 సంస్థలకు శంకుస్థాపనలు

కాగ్నిజెంట్ సంస్థతో పాటు త్వరలోనే విశాఖ నుంచి మరి కొన్ని సంస్థలు కూడా కార్యాకలాపాలు మొదలు పెట్టనున్నాయి. వీటిల్లో కొన్నింటికి శుక్రవారం నాడే శంకుస్థాపనలు జరిగాయి. టెక్ తమ్మిన, సత్వ డెవలపర్స్, ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్ ఇండియా, ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్, మదర్సన్ టెక్నాలజీస్, క్వార్ట్స్ టెక్నోసాఫ్ట్, ఏసీఎన్ హెల్త్ కేర్ ఆర్సీఎం సర్వీసెస్, నాన్రెల్ టెక్నాలజీస్ వంటి సంస్థలకు శంకుస్థాపనలు జరిగాయి.

త్వరలో విశాఖలో తమ కార్యకలాపాలు చేపట్టనున్నట్టు ఆయా సంస్థల ప్రతినిధులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సంస్థల ద్వారా రాష్ట్రానికి రూ. 3,740 కోట్ల పెట్టుబడులు, దాదాపు 41,700 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. ప్రస్తుతం విశాఖలో 150కి పైగా టెక్ కంపెనీల కార్యకలాపాలు సాగిస్తుండడంతో రాష్ట్రంలో ఐటీ నిపుణులకు విస్తృతంగా అవకాశాలు పెరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లో ఒక్క విశాఖలోనే రూ.1.34 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు వచ్చాయి.

ఈ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు ఐటీ, విద్యా శాఖా మంత్రి నారా లోకేష్, డీబీవీ స్వామి, ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు ఘంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణ మూర్తి, కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్, ఐటీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆదరించి అవకాశం ఇవ్వండి

-ఆదర్శ పంచాయతీగా దాదన్ పల్లి
-సర్పంచ్ అభ్యర్థి ప్రతాప్ రెడ్డి

మహబూబ్‌నగర్, డిసెంబర్ 12: గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఆదరించి అవకాశం కల్పించండి దాదనపల్లి గ్రామాన్ని మండలంలో ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతామని బీజేపీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జి.ప్రతాపరెడ్డి అన్నారు. ఇవాళ ఆయన తన మద్దతుదారులతో గ్రామంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి గ్రామ సమస్యలను వివరిస్తూ సమస్యల పరిష్కారం కావాలంటే సర్పంచ్ గా తనను గెలిపించవలసిందిగా అభ్యర్థించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే తన ధ్యేయమన్నారు. రాజకీయాలకు అతీతంగా పంచాయతీ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వవలసిందిగా ఆయన అభ్యర్థించారు. గ్రామంలో డ్రైనేజీలు, అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా ముంపు గ్రామ సమస్యలను పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. గ్రామ అభివృద్ధి కోసం తనను ఆదరించి సర్పంచిగా గెలిపించవలసిందిగా ప్రతాపరెడ్డి గ్రామస్థులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో

మద్దతు దారులు, నాయకులు బి .వెంకటన్న ,లింగప్ప, గంగప్ప, కురువ భీమన్న, గోకరి భీమన్న, మీదిగేరి హనుమంతు, బళ్లారి హనుమంతు, గుగ్గుళ్ల ఆంజనేయులు, బొంపల్లి అశోక్, భీమ్లమ్మ ,శంకరమ్మ, జయమ్మ, లక్ష్మి, అంజమ్మ ,మల్లమ్మతదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలకు అనుమతి తప్పని సరి

మచిలీపట్నం, డిసెంబర్ 11: గ్రామాలలో గాని, పట్టణా లలో గాని రహదారులపై, జన సంచారం ఉండే ప్రదేశాలలో విగ్రహాలను ఏర్పాటు చేస్తే సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని బందరు డి.ఎస్.పి సిహెచ్ రాజా తెలిపారు.

విగ్రహాలు ఏర్పాటు చేయడానికి ఎలాంటి అనుమతులు లేవు. కావున ఈ విషయాన్ని ప్రజలందరూ దృష్టిలో ఉంచుకొని పోలీసువారికి సహకరిస్తూ, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటిస్తూ శాంతియుత సమాజ స్థాపనకు భాగస్వాములు అవుతారని తెలిపారు. అలాకాకుండా నియమాలు అతిక్రమించిన ఎడల వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రామాయణ సాంస్కృతిక పర్యాటక కారిడార్

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటకం సహా దేశంలో వివిధ పర్యటన ప్రధాన సేవలను పర్యాటక శాఖ ప్రోత్సహిస్తోంది. ఈ ప్రోత్సాహక చర్యల్లో.. ప్రచార యాత్రా కార్యక్రమాలనూ, ప్రదర్శనలనూ నిర్వహించడంతో పాటు వాటిలో పాలుపంచుకోవడం; మేళాలూ, ఉత్సవాలూ నిర్వహించడంలో రాష్ట్రాల ప్రభుత్వాలకూ, కేంద్ర పాలిత ప్రాంతాల పాలనా యంత్రాంగాలకూ సాయాన్ని అందించడం; ఆతిథ్య కార్యక్రమంలో భాగంగా ప్రభావశాలి వ్యక్తులనూ, టూర్ ఆపరేటర్లనూ, పాత్రికేయులనూ, అభిప్రాయాన్ని ఏర్పరచగలిగేవారినీ దేశంలో పర్యటించాల్సిందిగా ఆహ్వానించడం; రాష్ట్ర ప్రభుత్వాలు, విదేశాల్లోని భారతీయ దౌత్య కార్యాలయాల సహకారంతో వెబ్‌సైట్, సామాజిక ప్రసార మాధ్యమాల్లో ప్రచారం చేయడం ద్వారా వివిధ ప్రజాసంబంధాల కార్యక్రమాల అమలు వంటి ప్రణాళికలు భాగంగా ఉన్నాయి. ప్రధానమంత్రి జన్‌జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ (పీఎంజే యూజీఏ)లో భాగంగా 'గిరిజన ప్రాంతాల్లో అతిథి సదుపాయాల (హోంస్టేస్) అభివృద్ధి'కి పర్యాటక శాఖ మార్గదర్శక సూత్రాలను రూపొందించింది. ఇది స్వదేశ్ దర్శన్ పరిధిలో ఓ ఉప పథకం. గిరిజన ప్రాంతాల్లో అతిథుల కోసం సదుపాయాలను పెంపొందించడం ఈ పథకం లక్ష్యంగా ఉంది. ఇది బాధ్యతాయుత పర్యటనకు దన్నుగా నిలవడానికి తోడ్పడుతుంది. గిరిజనులకు బతుకుతెరువు అవకాశాలను వీటి తో పెంచవచ్చు. గిరిజన గ్రామాల్లో నాణ్యమైన పర్యటన ప్రణాళికలను అవలంబించేలా వాటాదారులను ప్రోత్సహించవచ్చు. ఈ పథకం లో గ్రామ సముదాయాల అవసరాల కోసం రూ.5 లక్షల వరకూ, 2 కొత్త గదులను నిర్మించడానికి రూ.5 లక్షల వరకూ, అలాగే ప్రతి ఒక్క కుటుంబానికీ ప్రస్తుతం ఉన్న గదులను నవీకరించడానికి రూ.3 లక్షల వరకూ ఆర్థిక సహాయాన్ని అందజేస్తారు. దీనికి అదనంగా, గ్రామీణ ప్రాంతాలు సహా దేశమంతటా అతిథి సదుపాయాలను ఏర్పాటు చేయడానికి సాయాన్ని అందించి ప్రోత్సహించడానికి ముద్రా రుణాల రూపంలో పూచీకత్తు అక్కర్లేకుండా సంస్థాగత రుణమివ్వనున్నట్లు కేంద్ర ప్రభుత్వం 2025-26లో బడ్జెట్‌లో ప్రకటించింది. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ ఈ రోజు రాజ్యసభలో లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ సమాచారాన్ని అందించారు.

భవానీ దీక్షల విరమణకు గట్టి బందోబస్తు

-ఏఐ డ్రోన్, సీసీ కెమెరాలతో రద్దీ పర్యవేక్షణ
-ఫేసియల్ రికగ్నిషన్‌తో పాత నేరస్థుల కదలికల గుర్తింపు
-కమిషనర్ ఎస్‌వి. రాజశేఖర్ బాబు ప్రత్యక్షంగా ఏర్పాట్ల పరిశీలన

విజయవాడ,డిసెంబర్ 12: భవాని దీక్షలు విరమణ నేపథ్యంలో నగర పోలీసులు ఆధునిక సాంకేతికతను కేంద్రంగా చేసుకుని పటిష్టమైన బందోబస్త్ అమలు చేస్తున్నారు. నగర పోలీసు కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు ఆధ్వర్యంలో ఏఐ డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాలు, ఫేసియల్ రికగ్నైజేషన్ పరికరాలతో దీక్షల విరమణ ప్రాంగణాన్ని క్రమంగా పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం ఇతర ఉన్నత పోలీసు అధికారులతో కలిసి భవానీ దీక్షా విరమణ ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. మోడల్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి స్నానఘాట్లు, క్యూలైన్లు, పార్కింగ్ ప్రాంతాలు, కేశఖండనశాలలు, హోల్డింగ్ ప్రాంతాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు.

ట్రాఫిక్ వ్యవస్థలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా డిసిపి షిరీన్ బేగం కు పలు సూచనలు చేశారు. అప్రమ్ యాప్ ద్వారా ట్రాఫిక్‌ను నిశితంగా పర్యవేక్షిస్తూ భవానీలు వాహనాలను నిర్ణీత ప్రదేశాల్లోనే పార్క్ చేసుకునేలా సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు.ఏఐ డ్రోన్ కెమెరాల ద్వారా గిరిప్రదక్షిణ ప్రాంతాల్లోని రద్దీని పర్యవేక్షించి అధికారులకు సూచనలు చేశారు. దేవాలయ పరిసరాల్లో పాత నేరస్థుల కదలికలను గుర్తించేందుకు ఫేసియల్ రికగ్నైజేషన్ వ్యవస్థలను అమర్చి, గుర్తించిన వెంటనే సంబంధిత క్రైమ్ సిబ్బందికి సమాచారం అందే విధంగా చర్యలు తీసుకున్నారు.

భక్తుల దర్శన సమయం ఎంతగా సాగుతోంది అనే దానిపై ఎప్పటికప్పుడు అంచనాలు తెలుసుకునే విధంగా సచివాలయ మహిళా పోలీసులకు ప్రత్యేక సూచనలు చేశారు. అనంతరం హోమగుండాలు, విరుముడి స్టాల్స్, ప్రసాదం కౌంటర్లను పరిశీలించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ ఎస్వి. రాజశేఖర బాబు, డీసీపీలు లక్ష్మీనారాయణ, షిరీన్ బేగం, కృష్ణ ప్రసన్న, ఆనంద్ బాబు, ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఇలక్కియా పాటు ఇతర అధికారులు, ఇన్స్పెక్టర్లు, ఎస్.ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాల్లో తప్పుదోవ పట్టించే సమాచారానికి వ్యతిరేకంగా పౌరులను బలోపేతం చేయనున్న ఐటీ నిబంధనలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 12:భారత రాజ్యాంగంలో అధికరణ 19 (1) ప్రకారం పౌరులకు భావప్రకటనా స్వేచ్ఛ ఉంటుంది. అయితే సామాజిక మాధ్యమాల్లో నకిలీ, తప్పుడు,తప్పుదోవ పట్టించే సమాచారం పెరుగుతున్న సందర్భాలను గుర్తించిన భారత ప్రభుత్వం వాటిని నియంత్రించడంపై దృష్టి సారించింది.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం సమాచార సాంకేతికత చట్టం 2000 ప్రకారం సమాచార సాంకేతికత (ఇంటర్మీడియరీ మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నైతిక నియమావళి) నియమాలు 2021ను ఫిబ్రవరి 25, 2021 న నోటిఫై చేసింది.

ఈ నియమాల్లో భాగం-ఉఉ.. వార్తలు, సమకాలీన విషయాల ప్రచురణకర్తలు తప్పనిసరిగా పాటించాల్సిన నైతిక నియమావళి గురించి ప్రధానంగా వివరిస్తుంది. ఇందులో కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ చట్టం 1995 ప్రకారం నిర్దేశించిన కార్యక్రమ నియమావళిని అనుసరించడం, ప్రెస్ కౌన్సిల్ చట్టం 1978 ప్రకారం పత్రికా ప్రవర్తనా నియమాలకు కట్టుబడి ఉండటం ఉంటుంది.

ఐటీ నిబంధనల ప్రకారం నీతి నియమావళికి కట్టుబడి ఉండటానికి మూడు అంచెల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ప్రవేశపెట్టింది.

అలాగే ఐటీ నిబంధనలు రెండో భాగంలో యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి మధ్యవర్తులు తమ ప్లాట్‌ఫారమ్‌లో తప్పుడు, అసత్యమైన, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని వ్యాప్తి చేయకుండా నివారించాల్సిన బాధ్యత వాటిపై ఉందని వివరిస్తుంది.

కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన నకిలీ వార్తలను గుర్తించేందుకు నవంబర్ 2019లో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖలోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో ఓ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ (ఎఫ్ సీయూ) ను ఏర్పాటు చేసింది.

కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలకు చెందిన అధికారులతో వార్తల ప్రామాణికతను నిర్ధారించిన తరువాత సరైన సమాచారాన్ని ఎఫ్ సీయూ తమ సామాజిక మాధ్యమ వేదికల్లో ప్రచురిస్తుంది.

సమాచార సాంకేతిక చట్టం 2000లోని సెక్షన్ 69ఏ ప్రకారం ప్రభుత్వం కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో వెబ్‌సైట్లు, సామాజిక మాధ్యమాలు, పోస్టులను నిరోధించడానికి అవసరమైన ఆదేశాలను జారీ చేస్తుంది. దేశ సార్వభౌమత్వం, సమగ్రత, దేశ రక్షణ, రాష్ట్ర భద్రత, శాంతి భద్రతలు వంటి అంశాల్లో ఈ చర్యలు తీసుకుంటుంది.

ఈ సమాచారాన్ని సమాచార, ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ నేడు రాజ్యసభలో డాక్టర్ లక్ష్మీకాంత్ బాజ్‌పాయి అడిగిన ప్రశ్నకు సమాధానంగా అందించారు.

ఆటో బోల్తా.. నాలుగురికి తీవ్ర గాయాలు..

బోధన్, డిసెంబర్ 12: బోధన్ నుంచి రుద్రూర్ వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ రోజు సాయంత్రం అతి వేగంతో ప్రయాణికులతో వెళుతున్న ఆటో గోదాముల వద్ద అదుపుతప్పి బోల్తా పడింది.

ఆటో డ్రైవర్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వ్యక్తులను 108లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

2026 సీజన్‌కు కొబ్బరి కనీస మద్దతు ధరకు కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబర్ 12:2026 సీజన్ కోసం కొబ్బరి కనీస మద్దతు ధరకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. సాగుదారులకు లాభదాయక ధరలను అందించడం కోసం అన్ని తప్పనిసరి పంటల కనీస మద్దతు ధరను అఖిల భారత సగటు ఉత్పత్తి వ్యయం కంటే కనీసం 1.5 రెట్ల స్థాయిలో నిర్ణయించనున్నట్లు ప్రభుత్వం 2018-19 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించింది. 2026 సీజన్‌కు తగిన సగటు నాణ్యత గల మిల్లింగ్ కొబ్బరి కోసం ఎంఎస్ పీని క్వింటాలుకు రూ.12,27గా, బాల్ కొబ్బరికి రూ.12,500గా నిర్ణయించారు.

2026 సీజన్ కోసం ఎంఎస్పీ గత సీజన్ కంటే మిల్లింగ్ కొబ్బరి క్వింటాలుకు రూ.445, బాల్ కొబ్బరి క్వింటాలుకు రూ.400 పెరిగింది. 2014 మార్కెటింగ్ సీజన్‌లో వరుసగా క్వింటాలుకు రూ.5,250, రూ.5,500గా ఉన్న మిల్లింగ్ కొబ్బరి, బాల్ కొబ్బరిల ఎంఎస్ పీని ప్రస్తుతం క్వింటాలుకు రూ.12,027, రూ.12, 500లకు పెరిగింది. అంటే 2026 మార్కెటింగ్ సీజన్‌కు ఇవి వరుసగా 129 శాతం, 127 శాతం వృద్ధిని నమోదు చేశాయి.

ఈ అధిక ఎంఎస్పీ కొబ్బరి సాగుదారులకు మెరుగైన లాభదాయక రాబడిని నిర్ధరించడమే కాకుండా... దేశీయంగా, అంతర్జాతీయంగా కొబ్బరి ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి సరిపడా కొబ్బరి ఉత్పత్తిని విస్తరించేలా రైతులను ప్రోత్సహిస్తుంది.

ధర మద్దతు పథకం కింద కొబ్బరి సేకరణ కోసం నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్‌లు సెంట్రల్ నోడల్ ఏజెన్సీలుగా వ్యవహరిస్తుంటాయి.

సమస్యలు పరిష్కరించాలని.. కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ఆందోళన

శ్రీకాకుళం, డిసెంబర్ 12: అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సీహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె. నాగమణి, ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె. కళ్యాణి, డి.సుధ డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, లబ్ధిదారులకు క్వాంటిటీ, పెరిగిన ధరలకనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అంతకు ముందు ఆర్బీ బంగ్లా జంక్షన్ నుంచి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలంతా కలెక్టర్ కార్యాలయం లోపలికి వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. ధర్నా వద్దకు ఐసిడిస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఐ.విమల ధర్నా వద్దకు వచ్చి.. అంగన్వాడీల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలియజేశారు.

ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా నాయుకులు అల్లు సత్యనారాయణ, ఎన్వి. రమణ, ఆర్. ప్రకాశరావు, బి.మురళి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. సింహాచలం, ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయుకులు ఎన్. హైమావతి, పి. లతాదేవి, జల్లు. కాంచన, వి.హేమలత, ఆర్ చంద్రమౌళి, కెవి హేమలత, లక్ష్మి, ఆర్ అప్పమ్మ, యన్. వెంకటలక్ష్మి, ఆర్. ఆదిలక్ష్మి, యన్. బాలామణి, టి. రాజేశ్వరి,భాగ్యలక్ష్మి,సరోజిని, కె. సూర్యం పాల్గొన్నారు.

60 టీటీడీ ఆలయాల్లో అన్నప్రసాద వితరణకు ఏర్పాట్లు

తిరుపతి, డిసెంబర్ 12: టీటీడీ ఆలయాలలో భక్తులకు నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాద వితరణ చేసేందుకు ఏర్పాట్లు చేపట్టింది. అన్నప్రసాద వితరణకు ఇప్పటికే ఆలయ ఈవో పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. అన్నప్రసాదం వితరణ, తయారీకి ధార్మిక సంస్థలు, మఠాలు ముందుకు వచ్చే వారితో అవగాహన చేసేందుకు చర్యలు తీసుకుంది . మొత్తం 60 టీటీడీ ఆలయాల్లో అన్నప్రసాదం పంపిణీకి త్వరలో శ్రీకారం చుట్టనున్నారు.

తిరుమల శ్రీవారి భక్తులకు ఉచితంగా అన్నప్రసాదాలు అందించేందుకు 1985 ఏప్రిల్ 6న టీటీడీ ప్రారంభించింది. మొదట తిరుమలలో కల్యాణకట్ట ఎదురుగా గల పాత అన్నదానం కాంప్లెక్స్‌లో అన్నదానం జరుగగా 2011 నుంచి తిరుమలలో అత్యాధునిక వసతులతో నిర్మించిన మాత శ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో అన్నప్రసాదం అందిస్తున్నారు. నవంబర్ 15 నాటికి రూ. 2,316 కోట్లు ఈ ట్రస్ట్ కు డిపాజిట్‌గా జమ అయ్యాయి.

ప్రస్తుతం తిరుమలలోని శ్రీ మాతృశ్రీ వెంగమాంబ అన్నప్రసాద వితరణ కేంద్రంతో పాటు, రాంబగీచ బస్టాండు, ఏఎంసీ, సీఆర్‌వో, పీఏసీ-1 వద్ద ఫుడ్ కౌంటర్లు, పీఏసీ - 2, పీఏసీ -4, పీఏసీ -5 హాల్స్, వైకుంఠం క్యూకాంప్లెక్స్ -1, 2లోని కంపార్ట్‌మెంట్లు, నారాయణ గిరి షెడ్స్, బయటి క్యూ లైన్స్ లలో అన్నప్రసాద వితరణ జరుగుతోంది. తిరుమలలో సాధారణ రోజుల్లో 1.80 లక్షల నుంచి 1.90 లక్షల మంది, వారాంతపు రోజులలో రోజుకు 2 లక్షల నుంచి 2.10 లక్షల మంది భక్తులు అన్నప్రసాదాలను స్వీకరిస్తున్నారు.

పెన్షన్ పంపిణీలో తేడా రావొద్దు

-ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవు
జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

కర్నూలు ప్రతినిధి. డిసెంబర్ 11: పెన్షన్ పంపిణీకి సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను హెచ్చరించారు. శుక్రవారం మంత్రాలయం, ఆలూరు పత్తికొండ ఎమ్మిగనూరు నియోజకవర్గాల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పెన్షన్ పంపిణీ అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పెన్షన్ పంపిణీకి సంబంధించి కొన్నిచోట్ల ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయడం లేదని, డబ్బులు వసూలు చేస్తున్నారని, పంపిణీ సమయంలో సరిగా ప్రవర్తించడం లేదని ఐవీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇలాంటి ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాలకు వారంలో మూడు సార్లు ఎంపీడీఓలు, డీఆర్డీఏ పీడీ వెళ్ళి విచారించి, నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చేనెల నుంచి ఇలాంటి ఫిర్యాదులు రాకూడదని, వస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

ప్రతి నెల ఉదయం 7 గంటలకే పెన్షన్ పంపిణీ ని ప్రారంభించాలని, అవినీతికి తావు లేకుండా, ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయాలని, పెన్షన్ దారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఎంపీడీఓ కార్యాలయంలో, డీఆర్డీఏ పిడి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, ర్యాండంగా లబ్ధిదారులకు ఫోన్‌చేసి ఫీడ్ బ్యాక్ సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు.

అలాగే అన్న క్యాంటీన్ లలో కూడా నాణ్యమైన భోజనాన్ని అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్ లో జెడ్పీ సీఈవో నాసర రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ రమణా రెడ్డి, మునిసిపల్ కమిషనర్ విశ్వనాథ తదితరులు పాల్గొన్నారు.

సినిమాటోగ్రఫీ చట్టం ద్వారా పారదర్శకమైన, చట్టబద్ధమైన చిత్ర ధ్రువీకరణ ప్రక్రియ గురించి వివరించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: సినిమాటోగ్రఫీ చట్టం-1952లోని సినిమాటోగ్రఫీ ధ్రువీకరణ నియమాలు-2024, సంబంధిత మార్గదర్శకాల ప్రకారం సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖలోని చట్టబద్ధమైన సంస్థ అయిన కేంద్రీయ చలన చిత్ర ధ్రువీకరణ సంస్థ (సీబీఎఫ్‌సీ) ప్రజలకు ప్రదర్శించడానికి వీలుగా చిత్రాలను ధ్రువీకరిస్తుంది.

దేశ సార్వభౌమత్వం, సమగ్రత, భద్రత, శాంతికి, మర్యాద, నైతికతకు, పరువు నష్టం, కోర్టు ధిక్కారం లేదా నేరానికి ఉసిగొల్పడం తదితర అంశాల్లో చట్టబద్ధమైన నియమాలకు అతిక్రమించేలా ఉంటే.. కోతలు లేదా మార్పులను సూచిస్తారు.

గడచిన ఐదేళ్లలో (2020-21 నుంచి 2024-25) వరకు 71,963 చిత్రాలను సీబీఎఫ్‌సీ సర్టిఫై చేసింది.

బోర్డు జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టులో అప్పీలు చేసే అవకాశాన్ని సినిమాటోగ్రఫీ చట్టం అందిస్తుంది. ఇలాంటి కేసులను చట్టబద్ధమైన చర్యల ఫలితాలకు అనుగుణంగా పరిష్కరిస్తారు.

సృజనాత్మక స్వాతంత్ర్యాన్ని పరిరక్షించడంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తూనే.. సినిమాటోగ్రఫీ చట్టం పరిధిలో తమ బాధ్యతలను ప్రభుత్వం, బోర్డు నిర్వర్తిస్తున్నాయి.

ఈ సమాచారాన్ని రాజ్యసభలో డాక్టర్ జాన్ బ్రిట్టస్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్ సమర్పించారు.

14న టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా మహాసభ

-తప్పుడు ప్రచారాలు, అక్రమ వసూళ్లపై అడ్-హాక్ కమిటీ హెచ్చరిక
-మామిడి సోమయ్యకు సంఘంతో సంబంధం లేదనడం అవివేకం
-జర్నలిస్టుల హక్కులు, సంఘ బలోపేతంపై కీలక నిర్ణయాలు

ఖమ్మం, డిసెంబర్ 12 (నేటినిజం ప్రతినిధి) :తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా మహాసభ ఈ నెల 14న జిల్లా కేంద్రంలో జరగనున్నట్లు అడ్‌హక్ కమిటీ కన్వీనర్ టి.ఎస్. చక్రవర్తి, కో-కన్వీనర్లు అర్వపల్లి నగేష్, నానబాల రామకృష్ణ, అంతోటి శ్రీనివాస్, వందనపు సామ్రాట్ లు తెలిపారు. ఈ మహాసభను ఫెడరేషన్ వ్యవస్థాపకులు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా, వారికి సంఘంతో సంబంధం లేదని ప్రచారం చేయడం అవివేకమని వారు స్పష్టం చేశారు. జిల్లా మహాసభల పేరుతో కొందరు వ్యక్తులు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నట్లు సమాచారం లభించిందని, టీడబ్ల్యూజేఎఫ్ పేరుతో జరిగే ఏ వసూళ్లనైనా కఠినంగా ఖండిస్తున్నామని కమిటీ సభ్యులు హెచ్చరించారు. రాష్ట్ర, జిల్లా కమిటీల కాలపరిమితి ముగిసినా పదవుల్లో కొనసాగుతూ తప్పుడు ప్రకటనలు చేస్తున్న వారిని జర్నలిస్టులు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మహాసభలో జిల్లా కమిటీ పునర్వ్యవస్థీకరణ, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ స్కీమ్, అక్రిడేషన్ కార్డులు, మహిళా జర్నలిస్టుల పరిరక్షణ-హక్కులు వంటి ముఖ్య అంశాలపై చర్చించాలని నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లా మహాసభ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టి.డబ్ల్యూ.జే.ఎఫ్ నాయకులు వంగా పుంగమ గౌడ్, కప్పల మధు, అమరబోయిన ఉపేందర్, కందరబోయిన కృష్ణ, కాసోజు శ్రీధర్, షకీల్, నజీర్, స్వర్ణ, అఖిల్, ప్రణయ్, హేమంత్, కాశి, శశి, శివకుమార్, అర్జున్, విజయ్ తదితరులున్నారు.

హైదరాబాద్‌లోని సీజీఓ టవర్స్‌లో హస్తకళల ప్రదర్శన, విక్రయ కార్యక్రమం విజయవంతం

హైదరాబాద్, డిసెంబర్ 12: జౌళి మంత్రిత్వ శాఖకు చెందిన డెవలప్‌మెంట్ కమిషనర్ (హస్తకళలు) కార్యాలయం పరిధిలోని హస్తకళల సేవా కేంద్రం హైదరాబాద్ లో రెండు రోజులపాటు నిర్వహించిన హస్తకళల ప్రదర్శన, విక్రయ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. కవాడిగూడలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల భవనంలో డిసెంబర్ 11, 12 వ తేదీల్లో ఈ కార్యక్రమం కొనసాగింది.

ఈ కార్యక్రమం, డిసెంబర్ 8 నుంచి 14 వరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న హస్తకళల వారోత్సవాలలో భాగంగా జరిగింది. రాష్ట్ర అవార్డు గ్రహీతలు, జీఐ ట్యాగ్ పొందిన కళాకారులు సహా నైపుణ్యం కలిగిన చేతివృత్తుల వారు తమ ప్రదర్శనలతో సందర్శకులను మంత్రముగ్ధులను చేశారు. హైదరాబాద్ లక్క గాజులు, చెరియాల్ పెయింటింగ్, మాస్క్ తయారీ, నిర్మల్ పెయింటింగ్, జరీ, జర్దోజీ ఎంబ్రాయిడరీ, ముత్యాల అభరణాలు, మండల పెయింటింగ్, టెర్రకోట, కుండలు, డ్రై ఫ్లవర్ క్రాఫ్ట్, వుడ్ టర్నింగ్, లక్కర్‌వేర్ వంటి తెలంగాణ సాంప్రదాయ హస్తకళల ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల భవనం, ఎన్టీపీసీ, పవర్ గ్రిడ్ కార్యాలయాల అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాకారులతో ముచ్చటించి వారి అద్భుతమైన పనితనాన్ని ప్రశంసించారు. ప్రదర్శనలోని అందమైన హస్తకళా ఉత్పత్తులను కొనుగోలు చేసి వారికి అండగా నిలిచారు. ఈ కార్యక్రమం చేతివృత్తుల వారి నైపుణ్యాలను ప్రదర్శించడానికి, తెలంగాణ గొప్ప హస్తకళ వారసత్వ సంపదను ప్రోత్సహించడానికి, జీవనోపాధి అవకాశాలను మెరుగుపరచడానికి ఒక ముఖ్యమైన వేదికగా నిలిచింది. దేశ సాంప్రదాయ హస్తకళలను పరిరక్షించడం, ప్రోత్సహించడంలో జౌళి మంత్రిత్వ శాఖ అచంచలమైన నిబద్ధతను ఇది తెలియజేస్తుంది.

అభివృద్ధి సంక్షేమం కోసం భారీ ర్యాలీ

మహబూబ్‌నగర్, డిసెంబర్ 12:సంగంబండ గ్రామ సమస్యల తీరాలంటే గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో బరిలో నిలిచిన గవినోళ్ళ సుమిత్రమ్మను గెలిపించాలని బికే ఆర్ ఫౌండేషన్ చైర్మన్ గవినోళ్ళ బాలకృష్ణ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రోజు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు .

ర్యాలీతోపాటు ఇంటింటి ప్రచారం చేపట్టి ఓటర్లను కలుసుకొని సుమిత్రమ్మను సర్పంచ్ గా గెలిపించాలని ఆయన అభ్యర్థించారు .18 ఏళ్లుగా సంగంబండ పునరావాస సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక స్థానిక ఎమ్మెల్యే, మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో సంగంబండ నిర్వాసితులకు రావాల్సిన మొత్తం చెల్లించడమే కాకుండా కెనాల్ బండను తొలగించి 20 గ్రామాలకు సాగు నీరు అందించడం జరిగిందన్నారు.

అదేవిధంగా మిగిలి ఉన్న సమస్యలు తీరాలంటే కాంగ్రెస్ పార్టీ మద్దతుతో బరిలో నిలిచిన సుమిత్రమ్మను గెల్పించవ లసిందిగా ఆయన ఓటర్లను కోరారు. ప్రతిపక్ష పార్టీల వల్ల ఏది సాధ్యం కాదని గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు. అందుకే అభివృద్ధి సంక్షేమం కోసం పంచాయతీ ఎన్నికల్లో సంగంబండ సర్పంచ్ గా సుమిత్రమ్మ ను భారీ మెజారిటీతో గెలిపించాలని బాలకృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు.

యాచకులకు రామగుండం బల్దియాలో పునరావాస ఏర్పాట్లు.. మున్సిపల్ కమిషనర్ జే అరుణ శ్రీ పిలుపు

కరీంనగర్, డిసెంబర్ 12: రామగుండంలో ఎక్కడ కూడా యాచకులు కనిపించవద్దనీ, ఆ దిశగా సమష్టిగా కృషి చేద్దామని స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్ జే. అరుణ శ్రీ పిలుపునిచ్చారు. స్మైల్ ప్రాజెక్టు నిర్వాహక సంస్థ శ్రీ వినాయక విమెన్ (అర్బన్) త్రిఫ్ట్ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటి రూపొందించిన పోస్టర్ శుక్రవారం నగర పాలక కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాచక వృత్తిలో ఉన్న వారిని గుర్తించి పునరావసం కల్పించడమే ఈ ప్రాజెక్టు ఉద్దేశమన్నారు.

రామగుండం నగర పాలక సంస్థ మెప్మా ఆధ్వర్యంలో గోదావరిఖని తిలక్ నగర్ లో స్మైల్ ప్రాజెక్టు పునరావస కేంద్రం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కేంద్రంలో ఉచిత వసతి, మూడు పూటలా భోజన వసతి, ఆసక్తి ఉన్నవారికి వివిధ అంశాలలో శిక్షణ ఇప్పించడంతో పాటు ఉపాధి కూడా కల్పించడానికి రూపకల్పన చేసినట్లు తెలిపారు. వికలాంగులు, అనాధలు. నిరాదరణకు గురైన వారు యాచక వృత్తిలో ఉన్నట్లు గమనిస్తే నేరుగా పునరావాస కేంద్రంలో చేర్పించాలనీ, అలా వీలు కాని పక్షంలో కేంద్ర నిర్వాహకుల ఫోన్ నం.7013584588, 8639717597కు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, సెక్రెటరీ ఉమా మహేశ్వర్రావు, మెప్మా టీఎంసీ మౌనిక, నీట ఊర్మిళ, రామగుండం పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు, స్మైల్ పునరావస కేంద్ర నిర్వాహకులు నూనె లతా మోహన్, నిర్వాహకులు శరత్ మోహన్, మమత తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ప్రజాస్వామ్య పరిరక్షణ అందరి బాధ్యత : వక్తలు

వరంగల్,డిసెంబర్ 12:సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం సాధించినప్పుడే భారత ప్రజాస్వామ్యం సంపూర్ణంగా నిలుస్తుందని కోదండరాం అన్నారు. హక్కులతో పాటు బాధ్యతలు స్వీకరించాల్సిన అవసరం ఉందని, సామాజిక ప్రజాస్వామ్య పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యతని ఉస్మానియా విశ్వవిద్యాలయ విశ్రాంత ప్రొఫెసర్ ఎం. కోదండరాం అన్నారు. హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల(స్వయం ప్రతిపత్తి)లో 'ఇండియా ఏ2047 : రియలైజింగ్ ది విజన్ ఆఫ్ ఎ డెవలప్డ్ ఈక్విటబుల్ అండ్ సస్టైనబుల్ రిపబ్లిక్' అంశంపై తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, హైదరాబాద్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్, హైదరాబాద్ సహకారంతో రాజనీతి శాస్త్ర విభాగం నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు శుక్ర వారం ముగిసింది. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళి అధ్యక్షత జరిగిన ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా కోదండరాం పాల్గొని మాట్లాడారు.

విశిష్ట అతిథిగా డి.రమేష్ పట్నాయక్ పాల్గొని మాట్లాడుతూ భారత్ ఏ2047 లక్ష్య సాధనలో విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. గౌరవఅతిథి ప్రొఫెసర్ దొంతి నరసింహారెడ్డి పర్యావరణ పరిరక్షణ సుస్థిర సమానత్వ దేశనిర్మాణానికి అవసర మన్నారు. ప్రిన్సిపాల్ బి. చంద్ర మౌళి మాట్లాడుతూ స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులు విద్య, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు, పరిశోధనా ఆసక్తులను పెంపొందిస్తున్నాయని చెప్పారు. సెమినార్ కన్వీనర్ సామ్యూల్ ప్రవీణ్‌కుమార్ సదస్సు నివేదికను సమర్పిస్తూ 46 పరిశోధనా పత్రాలు అందాయని తెలిపారు. అతిథులను శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించి పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. వివిధ కాలేజీల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్ట్ టైం స్వీపర్స్ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం

తాండూర్, డిసెంబర్ 12: రాష్ట్ర గ్రంథాలయ పార్ట్ టైం స్వీపర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గంథాలయ యూనియన్ అధ్యక్షుడు చాగంటి అయోధ్య మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా గ్రంథాలయ పార్ట్ టైం స్వీపర్స్ వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

సంస్థ చైర్మన్ తమ సమస్యలను సానుకూలంగా విని డైరెక్టర్ శ్రీహరితో కలిసి చర్చించి త్వరలోనే సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్ట్ టైం స్వీపర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పిట్ట హుస్సేన్, ప్రధాన కార్యదర్శి కాస్తల మధు, గౌరవ అధ్యక్షుడు ఎనగందుల శ్రీనివాస్, కోశాది కారి ఖమ్మంపాటి మధుసూదన్, సహాయ కార్యదర్శి సయ్యద్ సలీం, చెరుకు స్వామి, సభ్యులు పాల్గొన్నారు.

రూ.వంద కోట్లకు పైగా జనం సొమ్మును ఖర్చు చేస్తున్నపుడు క్యాబినెట్ అనుమతి అవసరం లేదా

-నిప్పులు చెరిగిన బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 12:ప్రజాధనంతో ఫుట్‌బాల్ ఆడుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి ఎవడబ్బ సొమ్మని రూ.వంద కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తారని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి నిప్పులు చెరిగారు. ఎవడబ్బ సొమ్మని సీఎం రేవంత్ రెడ్డి తన ఫుట్ బాల్ సరదా కోసం రూ.వంద కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు ? ఇది ముమ్మాటికీ ఆర్థిక నేరమేనన్నారు. ప్రజాధనంతో ఫుట్‌బాల్ ఆడుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి ? ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజలు నిన్ను ఫుట్ బాల్ ఆడుకుంటారని హెచ్చరించారు. సీఎం ఫుట్ బాల్ సరదా కోసం రూ.100 కోట్లకుపైగా ఖర్చు పెట్టడం ప్రజాధనం దుర్వినియోగం కాదా ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో మెస్సీతో ఫుట్ బాల్ మ్యాచ్ ఆడడానికి ప్రభుత్వం రూ.ఎన్ని కోట్లు ఖర్చు చేస్తోందో, ఏ యే శాఖల నుంచి ఖర్చు చేస్తోందో, ఎందుకు ఖర్చు చేస్తోందో సీఎం వివరణ ఇవ్వాలి. సీఎం రేవంత్ టీమ్ ను సింగరేణి స్పాన్సర్ చేస్తోందని మీడియాలో చూసాను. ఈ ఫుట్ బాల్ ఆట కోసం సింగరేణి డబ్బులను ఎంత ఖర్చు చేస్తున్నారు. ఎందుకు ఖర్చు చేస్తున్నారు. ఇవే డబ్బులను సింగరేణిలో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించడానికి లేదంటే కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయవచ్చు కదా ప్రభుత్వ శాఖలేవైనా దుబారా ఖర్చులు చేస్తే ను కట్టడి చేయాల్సిన సీఎం, స్వయంగా తన సరదా కోసం దుబారా చేయడం ఆర్థిక నేరమే మెస్సీ టీమ్ తో రేవంత్ టీమ్ ఫుట్ బాల్ ఆడడం వల్ల రాష్ట్రానికి వచ్చే ప్రయోజనమేంటో సీఎం చెప్పాలి. అంతరాజ్జతీయ ఫుట్ బాల్ దిగ్గజం లియోనిల్ మెస్సీ ఒక ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడితే, అప్పీయరెన్స్ ఫీజు కింద రూ.70 కోట్లు తీసుకుంటారని మీడియా చూసా మరి మెస్సీకి ఇచ్చే అప్పీయరెన్స్ ఫీజు ఏ ప్రభుత్వ శాఖ ఇస్తోంది. దాని వల్ల కలిగే ప్రయోజనమేంటి మెస్సీకి ఇచ్చే మొత్తంతోపాటు ఆయన వ్యక్తిగత భద్రత సిబ్బందికి వసతి, విమాన ఖర్చులను ప్రభుత్వమే భరిస్తున్నది. అంతా కలిపి రూ.వంద కోట్లకుపైగా ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది. సింగరేణి, పర్యాటక, క్రీడల శాఖల నుంచి నిధులను మెస్సీ టూర్ కు మళ్లించినట్టు సమాచారం. ఫుట్ బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ తో ఈ మూడు శాఖలకు కలిగే ప్రయోజనమేంటి దేశంలోనే అత్యుత్తమ పది క్రికెట్ గ్రౌండ్లలో ఒకటైన ఉప్పల్ స్టేడియానికి ఫుట్ బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ తో తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. ఈ ఎగ్జిబిషన్ మ్యాచ్ కోసం ఉప్పల్ క్రికెట్ గ్రౌండును ఫుట్ బాల్ గ్రౌండుగా మార్చాలి. మ్యాచ్ ముగిసాక మళ్లీ దాన్ని క్రికెట్ గ్రౌండుగా మార్చాలి. దీని కోసం రూ. 10 కోట్ల వరకు ఖర్చు కావచ్చుట. మరి ఇదంతా దుబారా కాదా, దీని వల్ల ఉప్పల్ క్రికెట్ గ్రౌండ్ నాణ్యత దెబ్బతినదా అని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన సింగరేణి శాఖను సీఎం రేవంత్ టీమ్ కు స్పాన్సరుగా ఉండడానికి ఎందుకు అంగీకరించారో చెప్పాలి. సీఎం రేవంత్ రెడ్డికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పూర్తిగా సరెండర్ అయ్యారు. భట్టి ఆర్థిక శాఖ బిల్లుల క్లియరెన్సుకు 30 శాతం కమిషన్లు తీసుకుంటున్నా సీఎం పట్టించుకోవడం లేదు. అందుకే ఇపుడు సీఎం రేవంత్ ఫుట్ బాల్ సరదా కోసం డిప్యూటీ సీఎం తన సింగరేణి శాఖ ద్వారా పూర్తిగా సహకరిస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి కాలేజీ రోజుల్లో ఫుట్ బాల్ ఆడేవారట.

అప్పటి సరదా తీర్చుకోవడం కోసం ఇపుడు మెస్సీతో రాష్ట్ర ప్రభుత్వ సొమ్ముతో ఫుట్ బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడుతున్నారు. ఒక గంటన్నర మ్యాచ్ కోసం సీఎం ముందుగా ప్రాక్టీస్ చేసుకోవడానికి మర్రిచెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రంలో ఏకంగా ఫుట్ బాల్ గ్రౌండును ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.ఐదు కోట్లు ఖర్చు చేశారు. ఎవడబ్బ సొమ్మని సీఎం రేవంత్ రెడ్డి తన సరదా కోసం రూ.వంద కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి. రూ.వంద కోట్ల ప్రజాధనంతో నీ ఫుట్ బాల్ సరదా తీర్చుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి ... ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజలు నిన్ను ఫుట్ బాల్ ఆడుకుంటారు. గుర్తుంచుకో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో భాగంగానే ఈ ఫుట్ బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ అని సిగ్గులేకుండా చెప్తున్న మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, ఈ ఫుట్ బాల్ మ్యాచ్ తో తెలంగాణ ఎలా రైజింగ్ అవుతుందో చెప్పాలి. గ్లోబల్ సమ్మిట్ జరిగింది డిసెంబరు 8,9 తేదీల్లో. ఆ సమ్మిట్ ముగిసిన నాలుగు రోజులకు ఈ ఫుట్ బాల్ మ్యాచ్ నిర్వహిస్తూ, ఈ మ్యాచ్ సమ్మిట్ లో భాగమని చెప్పేందుకు మంత్రులకు సిగ్గుండాలి. అసలు గ్లోబల్ సమ్మిట్ ప్లానింగులో ఈ ఫుట్ బాల్ మ్యాచ్ లేనే లేదు. అసలు రేవంత్ సర్కార్ రెండేళ్లు పూర్తి చేసుకున్న విషయం ఈ ఫుట్ బాల్ ప్లేయర్ మెస్సీకి తెలుసా కేరళ ప్రభుత్వం ఫుట్ బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ నిర్వహించడం తమ వల్ల కాదని నిరాకరిస్తే, మెస్సీ ఇండియా టూర్ ను ప్లాన్ చేసిన ఈవెంట్ ఆర్గనైజేషన్ సీఎం రేవంత్ రెడ్డిని ముంబైలో కలిసి తెలంగాణలో నిర్వహించాలని కోరారు.

కేంద్ర మాజీ మంత్రి సుశీల్ కుమార్ షిండే మనవరాలి పెళ్లి కోసం సీఎం రేవంత్ రెడ్డి అక్టోబరు 31న ముంబై వెళ్లినపుడు అక్కడ ఫుట్ బాల్ మ్యాచ్ ఈవెంట్ ఆర్గనైజర్లు కలిశారు. అంటే హైదరాబాద్ లో ఫుట్ బాల్ మ్యాచ్ పెట్టాలనేది నెల రోజుల క్రితం డిసైడ్ అయింది. కానీ గ్లోబల్ సమ్మిట్ మూడు నెలల క్రితం డిసైడ్ అయింది.

జల కాలుష్యంకి శాశ్వత పరిష్కారం అందించాలి

– హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్ అండ్ సీవరేజ్ బోర్డ్ కు 133.5 కోట్లరూపాయల నిధులు మంజూరు చేయాలి

– కేంద్ర జల శక్తి మంత్రివర్యులు సిఆర్ పాటిల్ ను కలిసిన ఎంపి ఈటల రాజేందర్

న్యూ డిల్లీ డిసెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్);జల కాలుష్యంకి శాశ్వత పరిష్కారం అందించాలని కోరుతు కేంద్ర జల శక్తి మంత్రివర్యులు సిఆర్ పాటిల్ ను మల్కాజ్గిరి పార్లమెంటు సబ్యులు ఈటల రాజేందర్ కలిసిన వినతి పత్రం సమర్పించారు. హైదరాబాద్ సికింద్రాబాద్ జంట నగరాలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. బహుళ అంతస్తులు భవనాలు నిర్మించడం వల్ల జన సాంద్రత పెరిగింది. కానీ ఎప్పుడో నిర్మించిన మురుగునీటి పారుదల వ్యవస్థ మాత్రమే ఉండడం వల్ల నిత్యం డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో పాటు చెరువులలోకి, నదులలోకి ఈ మురుగు నీరు చేరటం వల్ల అవి కలుషితం అవుతున్నాయి. మల్కాజ్గిరి పార్లమెంట్ పరిధిలో ఈ సమస్య ఎక్కువగా ఉంది.

విమాన టికెట్ల ధరలను ఏడాది పొడువునా నియంత్రించలేం : కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ, డిసెంబర్ 12:ఇటీవల ఇండిగో సంక్షోభం సమయంలో విమాన చార్జీలు విపరీతంగా పెరిగాయి. దాంతో కేంద్రం ప్రభుత్వం రంగంలోకి దిగి టికెట్ల ధరలపై పరిమితిని విధించింది. తాజాగా విమాన చార్జీల నియంత్రణపై కేంద్రం కీలక ప్రకటన చేసింది. విమాన టికెట్ల ఛార్జీలను ఏడాది పొడువునా నియంత్రించలేమని పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు పార్లమెంట్‌లో స్పష్టం చేశారు. పండుగల సమయంలో టికెట్ల ధరల పెరుగుతాయని.. ఛార్జీలపై దేశవ్యాప్తంగా పరిమితి విధించడం ఆచరణాత్మకం కాదని తెలిపారు. నియంత్రణ లేని మార్కెట్ కారణంగా వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ రంగం అభివృద్ధి చెందడానికి నియంత్రణ సడలింపులు జరిగాయన్న ఆయన.. అసాధారణ వృద్ధిని చూసిన ఇతర దేశాలు నియంత్రణ ఎత్తివేసిందన్నారు.

దాంతో మరిన్ని కంపెనీలు ఈ రంగంలోకి ప్రవేశించేలా ప్రోత్సహిస్తుందని చెప్పారు. మార్కెట్ డైనమిక్స్ ఆధారంగా ధరలుంటాయని.. అంతిమంగా ప్రయాణీకులు అతిపెద్ద లబ్ధిదారులుగా నిలుస్తారన్నారు. విమాన ఛార్జీలపై నియంత్రణ ఎత్తివేయాలని కోరుతూ ఓ సభ్యుడు ప్రైవేట్ మెంబర్ బిల్లుపై ఆయన స్పందించారు. నియంత్రణ సడలింపు ఆలోచన ఇప్పటికీ కొనసాగుతోందని.. మనం పౌర విమానయాన రంగాన్ని అభివృద్ధి చేయాలనుకుంటే, అతి ముఖ్యమైన అవసరం ఏమిటంటే.. మరిన్ని కంపెనీలు మార్కెట్లోకి ప్రవేశించగలిగేలా దానిపై నియంత్రణలు తొలగించడమేనన్నారు. మార్కెట్ నియంత్రణ సడలింపు ఉన్నప్పటికీ.. ప్రస్తుత రూపంలో ఉన్న విమాన చట్టం దుర్వినియోగం జరిగే అవకాశం ఉన్న అసాధారణ పరిస్థితులలో జోక్యం చేసుకుని పరిస్థితిని సరిదిద్దే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి ఇస్తుందని.. ఇందులో ప్రయాణీకుల నుంచి అసమంజసమైన ఛార్జీలను నివారించడానికి చార్జీలపై పరిమితిని నిర్ణయించడం సైతం ఉందని కేంద్ర మంత్రి తెలిపారు.

అట్లకాడతో వాతలు.. చిన్నారిపై ట్యూషన్ టీచర్ దాష్టీకం

హైదరాబాద్ డిసెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్);అట్లకాడతో వాతలు.. చిన్నారిపై ట్యూషన్ టీచర్ దాష్టీకం హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్‌లో దారుణం చోటుచేసుకున్నది. ఓ చిన్నారిపై ట్యూషన్ టీచర్ దాష్టీకానికి పాల్పడింది. విచక్షణ మరచిన టీచర్ చిన్నారిపై 8 చోట్ల అట్లకాడతో వాతలు పెట్టింది. దీంతో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. షేక్‌పేటలోని ఓయూ కాలనీకి చెందిన ఏడేండ్ల బాలుడు తేజ నందన్ ఒకటో తరగతి చదువుతున్నాడు. స్థానికంగా ఉన్న మానస అనే టీచర్ వద్దకు అతని తల్లిదండ్రులు ట్యూషన్‌కు పంపుతున్నారు. రోజూలానే గురువారం సాయంత్రం కూడా ట్యూషన్‌కు వెళ్లాడు. అయితే సరిగ్గా చదవడం లేదనే కారణంతో కాళ్లు, చేతులు, ముఖంపై అట్లకాడతో కాల్చింది. దీంతో బాలుడి శరీరంపై 8 చోట్ల కాలిన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ట్యూషన్ టీచర్‌పై ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలుడిని వైద్య పరీక్షల నిమిత్తం గోల్కొండ ఏరియా దవాఖానకు పంపించారు. గాయాల వల్ల తేజ నందన్‌నడవలేకపోతున్నాడు. తమ కొడుకును విచక్షణారహితంగా అట్లకాలతో కాల్చిన మానసపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

వ్యక్తిత్వ హక్కులు కాపాడాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన పవన్ కళ్యాణ్

న్యూ డిల్లీ డిసెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్ కళ్యాణ్ తన వ్యక్తిత్వ హక్కులు కాపాడాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా తమ ఫోటోలను, వీడియోలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో మార్ఫింగ్ చేసి దుర్వినియోగం చేస్తున్న సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై చర్యలు తీసుకోవాలని ఆయన కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.అయితే పవన్ పిటిషన్‌ని శుక్రవారం విచారించిన ఢిల్లీ హైకోర్టు ఈ విషయంలో కీలక ఆదేశాలు జారీ చేసింది.

పవన్ కళ్యాణ్ ఫోటోలు, వీడియోలు దుర్వినియోగం అవుతున్న లింకులను 48 గంటల్లోగా తమకు అందించాలని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను ఆదేశించింది. అంతేకాకుండా, ఆ లింకులపై వారం రోజుల్లోగా తగిన చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. పవన్ కళ్యాణ్ ఇమేజ్‌ను వీడియోలను ఉపయోగించి ఎవరైనా సృష్టించిన తప్పుడు కంటెంట్‌ను తొలగించాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను న్యాయస్థానం డిసెంబర్ 22కు వాయిదా వేసింది. ఢిల్లీ హైకోర్టు తాజా ఆదేశాలతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు తాత్కాలికంగా ఊరట లభించినట్లయింది.

నర్సక్క పేట గ్రామాన్ని మోడల్ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యం.

-అన్ని వర్గాల ప్రజల సంక్షేమం , ఉపాధి అవకాశాల కోసం నిరంతరం కృషి చేస్తా...

- సర్పంచ్ అభ్యర్థిని బొల్ల రజిత రామచంద్రారెడ్డి.



కరీంనగర్, డిసెంబర్ 12: (నేటినిజం ప్రతినిధి) ఇల్లంతకుంట మండలం నర్సక్కపేట గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా, మోడల్ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తానని ఆ గ్రామ సర్పంచి అభ్యర్థిని బొల్ల రజిత రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారం శుక్రవారం ముగిసిన నేపథ్యంలో నర్సక్క పేట గ్రామంలో బోల్ల రజిత రామచంద్ర రెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి గ్రామాభివృద్ధి లక్ష్యంతో, అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పోటీలో నిలిచిన తనను ఆశీర్వదించి, బ్యాట్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని బోల్ల రజిత రామచంద్రారెడ్డి కోరారు. పట్టభద్రురాలైన తనకు గ్రామ సమస్యలపై అవగాహన ఉందని, గ్రామ అభివృద్ధి , అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం శాయా శక్తుల కృషి చేస్తానని రజిత తెలిపారు. సర్పంచిగా తనకు అవకాశం కల్పిస్తే గ్రామంలో ప్రధానంగా మౌలిక వసతుల కల్పన ధ్యేయంగా , అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి ప్రణాళికతో ముందు కొనసాగుతానని తెలిపారు. ప్రధానంగా రక్షిత మంచినీరు, అంతర్గత రోడ్లు, ప్రధాన రహదారులు, మురికి కాలువలు , వీధి దీపాలు, సెంట్రల్ లైటింగ్ , చెత్త కోసం డంపు యార్డ్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ , స్మశాన వాటిక , అంగన్వాడి సెంటర్, ప్రజా ఆరోగ్య కేంద్రం , ఓపెన్ జిమ్ , క్రీడా ప్రాంగణం వంటి మౌలిక వసతుల ఏర్పాటు ,అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని ఆమె హామీ ఇచ్చారు .అన్ని వర్గాల ప్రజలు, యువకులు, రైతులు, మహిళలు, వికలాంగులు, వృద్ధులు , నిరుపేద కుటుంబాలు , విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు అందించి ఆదుకోవడానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. గ్రామంలోని వివిధ కుల సంఘాల అభివృద్ధి కోసం , ఆయా కుల వృత్తుల ఉపాధి కోసం కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వ పథకాల సహకారంతో, రుణాలు ఇప్పించడానికి, ఆయా కులాల ప్రజలను ఆదుకోవడానికి తగిన సహాయ సహకారాలు అందిస్తానని ఆమె తెలిపారు. అలాగే గ్రామంలోని నిరుద్యోగ యువతకు, నిస్సహాయ స్థితిలో ఉన్నవారికి ఉపాధి మార్గాలు కల్పించడానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీలకు అతీతంగా, ప్రజలందరి సహాయ సహకారాలతో గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని , కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మంత్రులు , ప్రజా ప్రతినిధులు, అధికారుల సహాయ సహకారాలతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా, మండలంలోనే నర్సక్క పేట గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దడానికి అహర్నిశలు కృషి చేస్తానని బోల్ల రజిత రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు.. జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో గ్రామ ప్రజలు సహకరించి ,ఈసారి తనకు సర్పంచిగా పనిచేసే అవకాశం ఇవ్వాలని, 14వ తేదీ ఆదివారం రోజున జరిగే పంచాయతీ ఎన్నికల్లో బ్యాట్ గుర్తు (క్రమ సంఖ్య 3) కు ఓటు వేసి గెలిపించాలని సర్పంచ్ అభ్యర్థి బోల్ల రజిత రామచంద్రారెడ్డి ఈ సందర్భంగా గ్రామ ఓటర్లను కోరారు.

క్యాన్సర్‌తో పోరాడుతున్న నటి.. సాయం చేయాలంటూ కరాటే కళ్యాణి రిక్వెస్ట్

హైదరాబాద్ డిసెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్);టాలీవుడ్‌లో సహాయ నటిగా ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న వాహిని అలియాస్ పద్మక్క ప్రస్తుతం తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో పోరాడుతూ ఐసీయూలో చికిత్స పొందుతున్న వార్త పరిశ్రమలో కలకలం రేపుతోంది. 1978లో జన్మించిన వాహిని, టెలివిజన్ ప్రేక్షకులకు 'జయ వాహిని' పేరుతో బాగా దగ్గరైంది. చిన్న పాత్రలతో కెరీర్ ప్రారంభించిన ఆమె అనేక తెలుగు, తమిళ సినిమాలు, టీవీ సీరియల్స్‌లో సహజమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సినిమాల కంటే టీవీ సీరియల్స్‌లో ఆమె ప్రయాణం మరింత బలంగా కొనసాగింది. జెమిని, ఈటీవీ వంటి ప్రముఖ చానెల్స్‌లో ప్రసారమైన అనేక సీరియల్స్‌లో నటిస్తూ మంచి గుర్తింపు సంపాదించారు. ఇటీవల ఆమె 'బహిర్భూమి' అనే సినిమాలో కూడా కనిపించారు. అయితే, ఈ టాలెంటెడ్ నటి ప్రస్తుతం రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. గత కొన్ని నెలలుగా చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి క్షీణించడంతో అవయవాల పనితీరులో లోపాలు కనిపించి ప్రస్తుతం ఐసీయూలో అత్యవసర చికిత్స అందిస్తున్నారు. వైద్యుల ప్రకారం, వాహినికి జరుగుతున్న నిరంతర చికిత్స, కీమోథెరపీ, శస్త్రచికిత్సలు, ఐసీయూ కేర్ కోసం ?25 లక్షల నుంచి ?35 లక్షల మధ్య ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే సినీనటి కరాటే కళ్యాణి సోషల్ మీడియాలో భావోద్వేగంతో చేసిన పోస్ట్ అందరి దృష్టిని ఆకర్షించింది. వాహిని తమ చిన్ననాటి స్నేహితురాలని, విజయనగరం లో మా ఇళ్లు పక్కపక్కనే ఉండేవని గుర్తుచేసుకున్న కల్యాణి, ఇప్పుడు జీవన్మరణ పోరులో ఉన్న వాహినికి పరిశ్రమ, అభిమానులు తప్పకుండా చేయూత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.అలాగే వాహినికి సంబంధించిన ఫోన్‌పే, గూగుల్ పే నంబర్లు, బ్యాంక్ అకౌంట్ వివరాలు కూడా షేర్ చేస్తూ ఆమెను కాపాడేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. కరాటే కళ్యాణి పోస్ట్ వైరల్ కావడంతో, హ్యాష్‌ట్యాగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. అనేక మంది ఆమెకు ఆర్థిక సహాయం చేస్తూ పంపిన స్క్రీన్‌షాట్లను పంచుకుంటున్నారు. తెరపై చిరునవ్వుతో, సహజమైన నటనతో అందరిని అలరించిన వాహిని నిజజీవితంలో ఆరోగ్యంతో మళ్లీ తిరిగిరావాలని సినీ ప్రముఖులు, అభిమానులు కోరుకుంటున్నారు.

బీహార్‌లో ఆందోళన కలిగిస్తున్న హెచ్ఐవీ పాజిటివ్ కేసులు

సీతామర్హి జిల్లాలోనే ఏకంగా 7,400 మందికిపైగా హెచ్ఐవీ ..వారిలో 400 మందికిపైగా చిన్నారులే

బీహార్ డిసెంబర్ (ఎక్స్ ప్రెస్ న్యూస్);బీహార్ రాష్ట్రంలో హెచ్ఐవీ పాజిటివ్ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఒక్క సీతామర్హి జిల్లాలోనే ఏకంగా 7,400 మందికిపైగా హెచ్ఐవీ పాజిటివ్‌గా తేలింది. వారిలో 400 మందికిపైగా చిన్నారులే ఉండటం గమనార్హం. జిల్లా ఆసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఈ షాకింగ్ వాస్తవాలు బయటపడ్డాయి. 400 మందికిపైగా పిల్లలకు వారి తల్లిదండ్రుల నుంచి వైరస్ సంక్రమించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇది చాలా ఆందోళనకరమైన పరిస్థితి అని వైద్య అధికారులు తెలిపారు. తల్లిదండ్రుల్లో ఎవరికి హెచ్ఐవీ ఉన్నా, పుట్టబోయే పిల్లలకు ఈ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని చెప్పారు. ఈ పరిస్థితిపై జిల్లా వైద్యాధికారి డాక్టర్ హసీన్ అక్తర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతి నెలా సగటున 50 నుంచి 60 కొత్త హెచ్ఐవీ కేసులు నమోదవుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం గుర్తించిన బాధితుల్లో దాదాపు 5,000 మంది రోగులకు వైద్య చికిత్స, మందులు అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. హెచ్ఐవీపై ప్రజల్లో అవగాహన లేకపోవడమే ఈ పరిస్థితికి కారణంగా ఆయన పేర్కొన్నారు.

మాయమాటలు చెప్పి యువతిపై ముగ్గురు వేర్వేరు ప్రదేశాలలో అత్యాచారం

అమరావతి డిసెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: మాయ మాటలు చెప్పి యువతిపై ముగ్గురు వేర్వేరు ప్రదేశాలలో అత్యాచారం చేసిన సంఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిపత్రి లోని ఓ గ్రామానికి చెందిన యువతి అనంతపురంలో డిప్లోమో సెకండ్ ఇయర్ చదువుతోంది. సొంత గ్రామం నుంచి అనంతపురం పోయే వచ్చేది. ఆటో డ్రైవర్ గురుమోహన్ పరిచయం కావడంతో మాయమాటలతో ఆమెను ప్రేమలోకి దించాడు. డిసెంబర్ 2న కాలేజీకి తీసుకెళ్తానని చెప్పి ఆటోలో తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి తీసుకెళ్తానని చెప్పి యువతిని తన ఇంటికి తీసుకెళ్లాడు. ఆమెపై అక్కడ బలవంతంగా అత్యాచారం చేసి మరుసటి రోజు సొంతూరుకు బస్సు ఎక్కించాడు. తాడిపత్రి చేరుకున్న తరువాత బస్సులో తెలిసిన యువకుడు ప్రదీప్ పరిచయం కావడంతో భయంతో అతడి వద్దకు వెళ్లింది. దీనిని అసరాగా తీసుకొని కడపలోని తన ఇంటికి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను తిరుపతి బస్సు ఎక్కించాడు. కాలేజీలో పరిచయమైన బ్రహ్మనాయుడుకు ఫోన్ చేయడంతో ఆమెను ఓదార్చి తన ఇంటికి యువతిని తీసుకెళ్లాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై మూడు రోజులు అత్యాచారం చేశాడు. బాధితురాలు బ్రహ్మనాయుడు నుంచి తప్పించుకొని ఇంటికి వెళ్లింది. జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. అప్పటికే తల్లిదండ్రులు తన కూతురు కనిపించడంలేదని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సింగరేణి నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుంది

-రెడ్ హిల్స్ లోని సింగరేణి భవన్ వద్ద బిజెపి ధర్నా

-బిజే ఎల్ పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తో పాటు పలువురు బిజెపి శ్రేణుల అరెస్టు

హైదరాబాద్ డిసెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సింగరేణి నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నదని బిజెపి శాసనసభ పక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి నేతృత్వంలో రెడ్ హిల్స్ లోని సింగరేణి భవన్ వద్ద బిజెపి ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా బిజెపి శాసనసభ పక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి తో పాటు పలువురు బిజెపి శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఎవడబ్బ సొమ్మని సీఎం రేవంత్ రెడ్డి తన ఫుట్ బాల్ సరదా కోసం రూ.వంద కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు.ఇది ముమ్మాటికీ ఆర్థిక నేరమే నన్నారు. డబ్బులను సింగరేణిలో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించడానికి లేదంటే కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయవచ్చు కదా ప్రజాధనంతో ఫుట్‌బాల్ ఆడుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి ? ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజలు నిన్ను ఫుట్ బాల్ ఆడుకుంటారని హెచ్చరించారు. సీఎం ఫుట్ బాల్ సరదా కోసం రూ.100 కోట్లకుపైగా ఖర్చు పెట్టడం ప్రజాధనం దుర్వినియోగం కాదా ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో మెస్సీతో ఫుట్ బాల్ మ్యాచ్ ఆడడానికి ప్రభుత్వం రూ.ఎన్ని కోట్లు ఖర్చు చేస్తోందో, ఏ యో శాఖల నుంచి ఖర్చు చేస్తోందో, ఎందుకు ఖర్చు చేస్తోందో సీఎం వివరణ ఇవ్వాల ని డిమాండ్ చేసారు. సీఎం రేవంత్ టీమ్ ను సింగరేణి స్పాన్సర్ చేస్తోందని మీడియాలో చూసాను. ఈ ఫుట్ బాల్ ఆట కోసం సింగరేణి డబ్బులను ఎంత ఖర్చు చేస్తున్నారు. ఎందుకు ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వ శాఖలేవైనా దుబారా ఖర్చులు చేస్తే ను కట్టడి చేయాల్సిన సీఎం, స్వయంగా తన సరదా కోసం దుబారా చేయడం ఆర్థిక నేరమే మెస్సీ టీమ్ తో రేవంత్ టీమ్ ఫుట్ బాల్ ఆడడం వల్ల రాష్ట్రానికి వచ్చే ప్రయోజనమేంటో సీఎం చెప్పాలి. అంతరాష్ట్రీయ ఫుట్ బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ ఒక ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడితే, అప్పీయరెన్స్ ఫీజు కింద రూ.70 కోట్లు తీసుకుంటారని మీడియా చూసా మరి మెస్సీకి ఇచ్చే అప్పీయరెన్స్ ఫీజు ఏ ప్రభుత్వ శాఖ ఇస్తోంది. దాని వల్ల కలిగే ప్రయోజనమేంటని ప్రశ్నించారు. మెస్సీకి ఇచ్చే మొత్తంతోపాటు ఆయన వ్యక్తిగత భద్రత నిబ్బందికి వసతి, విమాన ఖర్చులను ప్రభుత్వమే భరిస్తున్నది. అంతా కలిపి రూ.వంద కోట్లకుపైగా ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది. సింగరేణి, పర్యాటక, క్రీడల శాఖల నుంచి నిధులను మెస్సీ టూర్ కు మళ్లించినట్టు సమాచారం. ఫుట్ బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ తో ఈ మూడు శాఖలకు కలిగే ప్రయోజనమేంటి దేశంలోనే అత్యుత్తమ పది క్రికెట్ గ్రౌండ్లలో ఒకటైన ఉప్పల్ స్టేడియానికి ఫుట్ బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ తో తూట్లు పొడుస్తున్నారు. ఈ ఎగ్జిబిషన్ మ్యాచ్ కోసం ఉప్పల్ క్రికెట్ గ్రౌండును ఫుట్ బాల్ గ్రౌండుగా మార్చాలి. మ్యాచ్ ముగిసాక మళ్లీ దాన్ని క్రికెట్ గ్రౌండుగా మార్చాలి. దీని కోసం రూ.10 కోట్ల వరకు ఖర్చు కావచ్చట. మరి ఇదంతా దుబాంా కాదా, దీని వల్ల ఉప్పల్ క్రికెట్ గ్రౌండ్ నాణ్యత దెబ్బతినదా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన సింగరేణి శాఖను సీఎం రేవంత్ టీమ్ కు స్పాన్సరుగా ఉండడానికి ఎందుకు అంగీకరించారో చెప్పాలని డిమాండ్ చేసారు.. సీఎం రేవంత్ రెడ్డికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పూర్తిగా సరెండర్ అయ్యారు. భట్టి ఆర్థిక శాఖ బిల్లుల క్లియరెన్సుకు 30 శాతం కమిషన్లు తీసుకు ంటున్నా సీఎం పట్టించుకోవడం లేదు. అందుకే ఇపుడు సీఎం రేవంత్ ఫుట్ బాల్ సరదా కోసం డిప్యూటీ సీఎం తన సింగరేణి శాఖ ద్వారా పూర్తిగా సహకరి స్తున్నారు రేవంత్ రెడ్డి కాలేజీ రోజుల్లో ఫుట్ బాల్ ఆడేవారట. అప్పటి సరదా తీర్చుకోవడం కోసం ఇపుడు మెస్సీతో రాష్ట్ర ప్రభుత్వ సొమ్ముతో ఫుట్ బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడుతున్నారు. ఒక గంటన్నర మ్యాచ్ కోసం సీఎం ముందుగా ప్రాక్టిస్ చేసుకోవడానికి మర్రిచెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రం లో ఏకంగా ఫుట్ బాల్ గ్రౌండును ఏర్పాటు చేశారు. ఇందు కోసం రూ.ఐదు కోట్లు ఖర్చు చేశారు. ఎవడబ్బ సొమ్మని సీఎం రేవంత్ రెడ్డి తన సరదా కోసం రూ.వంద కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. రూ.వంద కోట్ల ప్రజాధనంతో నీ ఫుట్ బాల్ సరదా తీర్చుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి ... ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజలు నిన్ను ఫుట్ బాల్ ఆడుకుంటారు. గుర్తుంచుకో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో భాగంగానే ఈ ఫుట్ బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ అని సిగ్గులేకుండా చెప్తున్న మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, ఈ ఫుట్ బాల్ మ్యాచ్ తో తెలంగాణ ఎలా రైజింగ్ అవుతుందో చెప్పాలి. గ్లోబల్ సమ్మిట్ జరిగింది డిసెంబరు 8,9 తేదీల్లో. ఆ సమ్మిట్ ముగిసిన నాలుగు రోజులకు ఈ ఫుట్ బాల్ మ్యాచ్ నిర్విహిస్తూ, ఈ మ్యాచ్ సమ్మిట్ లో భాగమని చెప్పేందుకు మంత్రు లకు సిగ్గుండాలన్నారు. అసలు గ్లోబల్ సమ్మిట్ ప్లానింగులో ఈ ఫుట్ బాల్ మ్యాచ్ లేనే లేదు. అసలు రేవంత్ సర్కార్ రెండేళ్లు పూర్తి చేసుకున్న విషయం ఈ ఫుట్ బాల్ ప్లేయర్ మెస్సీకి తెలుసా కేరళ ప్రభుత్వం ఫుట్ బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ నిర్వహించడం తమ వల్ల కాదని నిరాకరిస్తే, మెస్సీ ఇండియా టూర్ ను ప్లాన్ చేసిన ఈవెంట్ ఆర్గనైజేషన్ సీఎం రేవంత్ రెడ్డిని ముంబైలో కలిసి తెలంగాణలో నిర్వహించాలని కోరారు. కేంద్ర మాజీ మంత్రి సుశీల్ కుమార్ షిండే మనవరాలి పెళ్లి కోసం సీఎం రేవంత్ రెడ్డి అక్టోబరు 31న ముంబై వెళ్లినపుడు అక్కడ ఫుట్ బాల్ మ్యాచ్ ఈవెంట్ ఆర్గనైజర్లు కలిశారు. అంటే హైదరాబాద్ లో ఫుట్ బాల్ మ్యాచ్ పెట్టాలనేది నెల రోజుల క్రితం డిసైడ్ అయింది. కానీ గ్లోబల్ సమ్మిట్ మూడు నెలల క్రితం డిసైడ్ అయింది. మరి వాస్తవాలు ఇలా ఉంటే సీఎం, మంతులు గ్లోబల్ సమ్మిట్ లో భాగంగా ఫుట్ బాల్ మ్యాచ్ అనడం సిగ్గుచేటు. సీఎం రేవంత్ తన సరదా కోసం ఫుట్ బాల్ ఆడుకునేట్టయితే, అందుకు స్పాన్సర్లను చూసుకోవాలి. కానీ సర్కార్ సొమ్ముతో ఫుట్ బాల్ ఆడడం ప్రజాధనం దుర్వి నియోగం చేయడమే. బీఆర్ఎస్ సర్కార్ ఈ కార్ రేసింగ్ ఈవెంట్ ద్వారా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందంటున్న రేవంత్ సర్కార్ ... మరి ఇపుడు ఫుట్ బాల్ మ్యాచ్ ఆడడం ప్రజాధనం దుర్వినియోగం కాదా. ఇందుకు సీఎం రేవంత్ రెడ్డి శిక్షార్హుడు కాదా ఫుట్ బాల్ మ్యాచ్ నిర్వహణ కోసం ప్రజాధనం ఖర్చు చేయడంపై క్యాబినెటు భేటీలో చర్చ జరిగిందా. మరి రూ.వంద కోట్లకు పైగా జనం సొమ్మను ఖర్చు చేస్తున్నపుడు క్యాబినెట్ అనుమతి అవసరం లేదా మేం లేవనెత్తిన ఈ ప్రశ్నలకు సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పిన తర్వాతనే ఫుట్ బాల్ మ్యాచ్ ఆడాలి. లేదంటే ఈ ఫుట్ బాల్ మ్యాచ్ కు వ్యతిరేకంగా బిజెపి మరిన్ని నిరసన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు.

గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక నిఘా

మద్యం, అమ్మకాలు, కొనుగోలు చేస్తే చర్యలు తప్పవు-- సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 12:నేటినిజం ప్రతినిధి): :గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో అక్రమ మద్యం రవాణా,విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగు తుందని, ఎన్నికల సమయంలో హోల్‌సేల్ రూపంలో భారీగా మద్యం ఆమ్మిన వారిపై ,కొనుగోలు చేసిన వారిపై నిఘా కఠినతరం చేసి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని డిఎస్పీ నాగేంద్రచారి హెచ్చరించారు. ఎన్నికల నియమావళి అమలు లోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు మొత్తం 90 కేసుల్లో 13 37 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు వెల్లడించారు. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికల నియమా వళి పకడ్బందీగా అమలు చేస్తు న్నామని, ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఆంక్షలను తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చట్టపరమైన తీసుకుంటామని, ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగాలంటే నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.

పోస్టినా ఫౌండేషన్ ఆధ్వర్యం లో 100 మంది పేదలకు బ్లాంకెట్స్ పంపిణీ

హైదరాబాద్ డిసెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్);పోస్టినా ఫౌండేషన్ నేషనల్ ఆల్ ఇండియా ఫౌండర్ చైర్మన్ సీఈవో డాక్టర్ కాకుమాను లూర్దు జ్యోతిఆధ్వర్యం లో పిల్లర్ మాత ఫౌండేషన్ నేషనల్, మరియు హెయిల్ టాటా మణి చారిటబుల్ ట్రస్ట్ సహకారం తో సెమి క్రిస్మస్ పురస్కరించుకొని ఉప్పరపల్లి అత్తాపూర్ ఏరియాలో 100 మంది పెదలకు బ్లాంకెట్స్ పంపిణీ చేయడం జరిగినది .ఈ కార్యక్రం లో పిల్లర్ మాత ఫౌండేషన్ నేషనల్ ఆల్ ఇండియా ఫౌండర్ చైర్మన్ సీఈవో పి.జగదీష్ కుమార్,జి మధుకర్ గౌడ్, ఎం. ఆనంద మురళి, సిహెచ్ .కళ, రూపా దేవి, షరీఫ్ ఉన్నిసా , లావణ్య ,ప్రేమలత, ఉషారాణి, శేషు, లతా, జోస్పీన్, సావిత్రి, కవిత, .శశి కుమారి, రాజు, .నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరాచారి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం..

-ఈశ్వరచారి కుటుంబానికి 5 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్ ను అందజేసిన మహేష్ కుమార్ గౌడ్..

హైదరాబాద్ డిసెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్); ఈశ్వరాచారి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఆత్మహత్యలు చేసుకోవద్దు.. బిసి రిజర్వేషన్లు సాధించి తీరుతాం.. మహేష్ కుమార్ గౌడ్..స్పష్టం చేసారు.ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఈశ్వరచారి కుటుంబానికి ప్రకటించిన ప్రభుత్వం 5 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్ ను బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం.. బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్ తో కలిసి అందజేశారు.కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ సంవిధాన్ బచావో కమిటీ చైర్మన్ డా.వినయ్, కార్పొరేషన్ చైర్మన్లు ఈరవత్రి అనిల్, నూతి శ్రీకాంత్, మెట్టు సాయి, బిసి సంఘం నాయకులు గణేష్ చారి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఈశ్వరచారి ఆత్మహత్య అత్యంత దురదృష్టకరమని, ఏ ఒక్కరు ఆత్మహత్య చేసుకోవద్దని, ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదని అన్నారు. బిసి రిజర్వేషన్లు కోసం కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నదని అన్నారు. ఎవ్వరు అధర్యపడొద్దని, బిసి రిజర్వేషన్లు సాదించుకుంటామని భరోసా ఇచ్చారు.

నేడు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు ఆలయ చైర్మన్ కొండ దేవయ్య

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 12:నేటినిజం ప్రతినిధి): వేములవాడ అయ్యప్ప స్వామి దేవాలయంలో నేడు శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ పూజలు, వ్రతాలు, సేవా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడుతున్నాని తెలిపారు. ఉదయం 6 గంటల నుండి అయ్యప్ప స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకంప్రత్యేక పూజలు ? హోమాలు జరుగుతాయని అన్నారు. ఉదయం 9 గంటలకు గజగౌరీ వ్రతం ఉంటుందని, ప్రతి మహిళా భక్తులు, సోదరీమణులు తప్పకుండా గజగౌరీ వ్రతంలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు పొందాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అరట్టుమహోత్సవం, అయ్యప్ప స్వామి ప్రత్యేక పూజలు నిర్వహింపబడతాయని తెలిపారు. ఉదయం 10 గంటలకు అయ్యప్ప స్వామి దేవాలయం ముందు ఉన్న సంతోషి మాత, సరస్వతి మహాలక్ష్మి అమ్మవార్ల, సాయిబాబా ఆలయంలో అయ్యప్ప స్వామికి అభిషేకం చక్రస్నానాలు, రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరగుతాయన్నారు.మధ్యాహ్నం భిక్ష ? అన్నదాన కార్యక్రమం, భక్తులకు మహా ప్రసాదం అందించబడుతుందని వెల్లడించారు.సాయంత్రం 6 గంటలకుసామూహిక మహా పడీపూజ ఘనంగా, భక్తిశ్రద్ధలతో జరగుతుందన్నారు. అయ్యప్ప మాల వేసుకున్న భక్తులు మాత్రమే కాకుండా, దీక్షలో లేని భక్తులు -కుటుంబ సభ్యులు కూడా ఈ సామూహిక పడీపూజలో పాల్గొనవచ్చన్నారు.అయ్యప్ప స్వామి కరుణ పొందేందుకు ఇది అపూర్వ అవకాశం అన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com